PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...




ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 131, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 01 - జులై - 2026 , వెల రూ.5/-



## సీఎం విజయ్ కీలక నిర్ణయం..

### తమిళనాడులో ఇక అన్నీ ఏసీ బస్సులే

- ఇకపై కొత్తగా కొనేవన్నీ ఏసీ బస్సులే
- సీఎం విజయ్ ఆదేశించారని వెల్లడించిన రవాణా మంత్రి
- మారుమూల ప్రాంతాలకూ బస్సు సౌకర్యమే లక్ష్యం
- ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

2లో

# విశాఖలో ఘనంగా గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం...

## రాష్ట్రపతికి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్

- విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 373 మంది విద్యార్థులకు పట్టాలు, 13 మందికి స్వర్ణ పతకాలు
- పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రధాన్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత
- రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికిన గవర్నర్, స్పీకర్, మంత్రులు



అమరావతి: విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ) తొలి స్నాతకోత్సవం మంగళవారం నాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మిగతా 2 లో

## మూసీ పరిహారం.. పునరావాసంలో రాజీపడం

### మానవీయ కోణంలో భూసేకరణ నిర్ణయాలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో

ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలి



2లో

## ఫడ్నవిస్ ను కలిసిన పవన్ కల్యాణ్..

## రెండు ఆడ పులులు ఇచ్చేందుకు అంగీకారం

### ఏపీకి రెండు ఆడ పులులు ఇచ్చేందుకు ఫడ్నవిస్ ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడి

- తూర్పు కనుమల్లో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్న పవన్
- ఫడ్నవిస్‌కు ధన్యవాదాలు తెలిపిన పవన్

అమరావతి: ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి..

## సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

- సీఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ
- హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం
- డిజిటల్, క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి పెట్టాలని సూచన
- తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వివరణ
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రస్తావన
- ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల ఆధునికీకరణపై చర్చ



హైదరాబాద్: తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా మిగతా 2 లో



2లో

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు: హరీశ్ రావు

- సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్
- 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ



2లో

## కాంగ్రెస్ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు

### ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి

- సభల పేరిట కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారు
- ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగసభా?
- రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది

హైదరాబాద్: రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట

## గ్రీస్‌లో భారత యూపీఐ సేవలు..

## వాణిజ్య బంధం బలోపేతమే లక్ష్యం




2లో

గ్రీస్‌లో అధికారికంగా ప్రారంభమైన యూపీఐ సేవలు

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఏథెన్స్‌లో ప్రత్యక్ష ప్రదర్శన

తక్కువ ఖర్చుతో తక్షణమే నగదు బదిలీ చేసుకునే వెసులుబాటు

# ఏపీలో విద్యా సంస్కరణలు భేష్..

## నారా లోకేశ్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసల వర్షం

- భోగాపురం పీఎంశ్రీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, లోకేశ్
- పాఠశాలలో ఆధునిక విద్యాబోధన, టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించిన బృందం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యారంగం అభివృద్ధికి, నూతన విద్యావిధానాల అమలుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు లోకేశ్ చూపిస్తున్న చొరవను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. మంగళవారం విజయనగరం జిల్లా భోగాపురంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌ను మిగతా 2 లో

# ఓటు పోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు..

### 'సర్'పై డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు

### ఓటు హక్కు కోల్పోవద్దని డీకే శివకుమార్ సూచన

### ఓటు లేకపోతే పథకాలపై ప్రభావం ఉంటుందని హెచ్చరిక

### కర్ణాటకలో మంగళవారం నుంచి ప్రత్యేక ఓటరు సవరణ ప్రారంభం

### జులై 29 వరకు ఇంటింటి సర్వే

### అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల



అమరావతి: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 'సర్' ప్రారంభమైన సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని మిగతా 2 లో

# వాతావరణం అనుకూలిస్తే.. జులై తొలి వారంలో రైతు ఆశీర్వాద సభ

## రైతుభరోసా నిధుల పంపిణీ పూర్తయిన అనంతరం త్వరలో 'రైతు ఆశీర్వాద సభ'

- రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని సీఎం సభను వాయిదా వేశాం
- పదేళ్లు అధికారంలో ఉండి వ్యవస్థలను నాశనం చేసి.. అందినకాడికి దోచుకున్నారు



హైదరాబాద్: తీవ్ర వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లిలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన సభ, పార్కింగ్ ప్రాంతాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర, సీపీ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ, అంతకుముందు మిగతా 2 లో

## మంగళగిరిలో ఓడిపోయాక ఎంతో బాధపడ్డా..

## దేవాన్ష్‌తో చెస్ ఆడితే పరువు పోయింది: నారా లోకేశ్



2లో

తాను, దేవాన్ష్ అన్నదమ్ముల్లా కొట్టుకుంటామన్న లోకేశ్

మంగళగిరిలో ఓడిపోయిన తర్వాత తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని వెల్లడి

తక్కువ మార్కులు వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని విద్యార్థులకు సూచన

# ఏపీలో విద్యా సంస్కరణలు భేష్..

ఏపీ మోడల్ స్కూల్‌ను మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ధర్మేంద్ర ప్రధాన్ సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో అమలు చేస్తున్న ఆధునిక విద్యాబోధన పద్ధతులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి. పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మంత్రులు పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగారు.

టెక్నాలజీ, సంప్రదాయాల మేళవింపు

పర్యటనలో భాగంగా, విద్యాబోధనలో వినియోగిస్తున్న పలు ఆధునిక ఉపకరణాలను మంత్రులు పరిశీలించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన 'జాదూ పిటారా' కిట్‌ను కేంద్ర మంత్రి ఆసక్తిగా గమనించగా, దాని పనితీరును మంత్రి లోకేశ్, సిబ్బంది వివరించారు. విద్యార్థుల ప్రగతిని నమోదు చేసే ప్రోగ్రెస్ కార్డులు, అసెస్‌మెంట్ బుక్‌లెట్లను లోకేశ్ కేంద్ర మంత్రికి చూపించారు. విలువలతో కూడిన విద్య కోసం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో ముద్రించిన పుస్తకాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్'లోని టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, షూ, స్కూల్ బ్యాగ్ వంటి వస్తువులను ప్రధాన్ పరిశీలించారు.

లీప్ డ్యాష్‌బోర్డుపై ప్రత్యేక ఆసక్తి

రాష్ట్ర విద్యాశాఖ పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన 'లీప్' డ్యాష్‌బోర్డును కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆసక్తిగా తిలకించారు. ఈ డ్యాష్‌బోర్డు ద్వారా విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు, మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్లు, అధికారుల తనిఖీలు వంటి అనేక అంశాలను రియల్ టైంలో పర్యవేక్షించవచ్చని మంత్రి లోకేశ్ వివరించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న స్మార్ట్ కిచెన్ల వ్యవస్థపై రూపొందించిన వీడియోను మంత్రులు వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్ర మంత్రికి లోకేశ్ విశదీకరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను సందర్శించి, అక్కడ విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్‌తో రూపొందించిన ఒక అప్లికేషన్‌ను పరిశీలించి అభినందించారు.

విద్యార్థులతో సరదాగా ముచ్చట్లు

అనంతరం మంత్రులిద్దరూ 9వ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల మధ్య కూర్చున్నారు. 'ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా' అనే పాఠ్యాంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి విద్యార్థులతో సరదాగా సంభాషించారు. చాణక్య అనే విద్యార్థిని "చాణక్యుడు కింగా? కింగ్ మేకరా?" అని ప్రశ్నించగా, ఆ విద్యార్థి 'కింగ్ మేకర్' అని చురుగ్గా సమాధానమిచ్చాడు. మరో విద్యార్థిని పాఠ్యాంశాల్లో సందేహాలు వస్తే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా, తన సోదరుడిని అడుగుతానని చెప్పాడు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల సౌలభ్యం కోసం బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్‌ను ప్రవేశపెట్టామని మంత్రి లోకేశ్ వివరించారు. విద్యార్థి స్థాయి ఆధారంగా బోధించే 'పాల్' ల్యాబ్‌ను కూడా మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పేర్లతో 3డీ ప్రింటింగ్‌తో రూపొందించిన బహుమతులను ఓ విద్యార్థి మంత్రులకు అందజేశాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు...
# శ్రీవారి హుండీకి భారీ ఆదాయం

తిరుపతి: తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం లభించింది. సోమవారం ఒక్కరోజే శ్రీవారి హుండీకి రూ.5.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. నిన్న శ్రీవారిని మొత్తం 95,498 మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల గిరులపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం 21 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ తెలిపింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం నాడు 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు. టీటీడీ నిన్న మొత్తం 4.34 లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించింది. అదేవిధంగా, 2.58 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించగా, 3,172 మందికి వైద్య సేవలు అందజేశారు.

## సీఎం విజయ్ కీలక నిర్ణయం..
# తమిళనాడులో ఇక అన్నీ ఏసీ బస్సులే

తమిళనాడు: తమిళనాడులో ఇకపై ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ తెలిపారు. ప్రజలు సౌకర్యంగా ప్రయాణించేలా ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పార్థిబన్ తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. ప్రతి కొత్త బస్సులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు ఉండాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సూచించినట్లు వెల్లడించారు. ఇటీవల విజయ్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రి విజయ్ 300 కొత్త ప్రభుత్వ బస్సులను ప్రారంభించారు. రూ.127.21 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. ఇందులో 164 డీజిల్ బస్సులు, 136 బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారైన సీఎన్‌జీ బస్సులు ఉన్నాయి. ప్రజారవాణాను మరింత ఆధునికంగా మార్చడంతో పాటు ప్రతి ప్రాంతానికి మెరుగైన బస్సు సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# విశాఖలో ఘనంగా గిరిజన వర్సిటీ స్నాతకోత్సవం...

అమరావతి: విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ) తొలి స్నాతకోత్సవం మంగళవారం నాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలను బహూకరించారు. ఈ స్నాతకోత్సవంలో రాష్ట్రపతితో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. వీరితో పాటు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కట్టమణి, రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ తదితరులు హాజరయ్యారు. అంతకుముందు, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేశ్, అనిత ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. "రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి విశాఖపట్నంలో స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన మీకు హృదయపూర్వక స్వాగతం" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# జోరందుకోనున్న వర్షాలు
# విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు..

ఢిల్లీ: దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఊపందుకున్నాయి. వాతావరణ వ్యవస్థలో ఏర్పడిన రెండు అనుకూల పరిస్థితుల కారణంగా రానున్న రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. జులై మొదటి వారంలో ఈ వర్షాల తీవ్రత మరింత పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాస్త్రవేత్తల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం దేశంలో రెండు వేర్వేరు అల్పపీడన ద్రోణులు క్రియాశీలకంగా ఉన్నాయి. అందులో మొదటిది గుజరాత్ తీరం నుంచి కేరళ తీరం వరకు పశ్చిమ తీరప్రాంతం వెంబడి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో అరేబియా సముద్రం నుంచి వీస్తున్న బలమైన గాలులు పశ్చిమ తీరప్రాంత రాష్ట్రాలలో భారీ వర్షాలకు కారణమవుతున్నాయి. ఇక రెండోది రాజస్థాన్ నుంచి ఈశాన్య బంగాళాఖాతాన్ని దాటుతూ దేశంలోని మధ్య, తూర్పు ప్రాంతాల గుండా వెళ్తోంది. ఈ రెండు వ్యవస్థల కలయిక వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా పెరగనుంది. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో కొంకణ్ తీరం, గోవా, కర్ణాటక సముద్ర తీర ప్రాంతాలతో పాటు కేరళలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ప్రాంతాలకు ఇప్పటికే అత్యవసర (రెడ్), ముందస్తు (ఆరెంజ్) హెచ్చరికలను జారీ చేశారు. అలాగే జులై 1 నుంచి 4వ తేదీల మధ్య మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర మధ్య భారత ప్రాంతాలలో కూడా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లతో పాటు పశ్చిమ బెంగాల్, సిక్కింలలో రాబోయే మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయవ్య భారతంలోని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడా రుతుపవనాల కదలికలు మెరుగయ్యాయని, అక్కడ కూడా వర్షాలు ఊపందుకుంటాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# గ్రీస్‌లో భారత యూపీఐ సేవలు..
# వాణిజ్య బంధం బలోపేతమే లక్ష్యం

ఢిల్లీ: భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యూపీఐ) తన ప్రపంచవ్యాప్త విస్తరణలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. తాజాగా యూరప్ దేశమైన గ్రీస్‌లో యూపీఐ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఏథెన్స్‌లోని యూరోబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూపీఐ ద్వారా లావాదేవీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. గ్రీస్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి రావడంతో అర్హులైన వినియోగదారులు తక్షణమే, అత్యంత సురక్షితంగా నగదు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే లావాదేవీల ఖర్చు దాదాపు నామమాత్రంగా ఉంటుందని ఆయన వివరించారు. సరిహద్దులు దాటి విలువను సృష్టించడం, ఉమ్మడి వృద్ధి కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం లక్ష్యంగా సాంకేతిక పరిష్కారాలను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు ప్రపంచవ్యాప్తంగా యూపీఐకి లభిస్తున్న ఆదరణ నిదర్శనమని గోయల్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. తన గ్రీస్ పర్యటనలో భాగంగా గోయల్ యూరోబ్యాంక్ సీఈఓ ఫోకియోన్ కరావియాస్‌తో సమావేశమయ్యారు. భారత్-గ్రీస్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై ఫలవంతమైన చర్చలు జరిపారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రీక్ వ్యాపారవేత్తలను ప్రోత్సహించిన ఆయన, గ్రీస్‌లో తయారీ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకారానికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. యూరోబ్యాంక్, ఎన్ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఫెయిర్‌ఫాక్స్ డిజిటల్ సర్వీసెస్ సీఈఓ సంజయ్ తుగ్నైత్ కూడా పాల్గొన్నారు. అంతకుముందు పీయూష్ గోయల్ గ్రీస్ డిప్యూటీ విదేశాంగ మంత్రి హ్యారీ థియోహారిస్‌తో కలిసి 'ఇండియా-గ్రీస్ బిజినెస్ ఫోరమ్'లో ప్రసంగించారు. భారతదేశ అద్భుతమైన వృద్ధి, బలమైన స్థూల ఆర్థిక పునాదులు గ్రీస్‌కు అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కీలక రంగాల్లో కలిసి పనిచేసేందుకు అపారమైన అవకాశాలున్నాయని భారత కంపెనీలతో చేతులు కలపాలని గ్రీక్ వ్యాపార వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య బలమైన వ్యాపార సంబంధాలకు, ఉమ్మడి శ్రేయస్సుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో
# 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 ట్నాకి అనుమతి తీసుకుని 1777 ట్నా నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## వాతావరణం అనుకూలిస్తే..
# జులై తొలి వారంలో రైతు ఆశీర్వాద సభ

మొదటి పేజి తరువాయి

అనంతరం అక్కడ, అంతకుముందు ఎర్రుపాలెం మండలం జమలాపురంలో విలేకర్లతో భట్టి మాట్లాడుతూ... 'వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారింది. రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని సీఎం సభను వాయిదా వేశాం. రైతుభరోసా నిధుల పంపిణీ పూర్తయిన అనంతరం త్వరలో 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తాం. వాతావరణం అనుకూలిస్తే ఇదే ప్రాంతంలో జులై 6 నుంచి 8 తేదీల మధ్య సభను నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. పదేళ్లు అధికారంలో ఉండి వ్యవస్థలను నాశనం చేసి.. అందినకాడికి దోచుకుని మళ్లీ వస్తామంటూ జిల్లాల్లో హరీశ్‌రావు, కేటీఆర్ తిరుగుతున్నారు. ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులోకి నెట్టారు. ఫోన్లు ట్యాప్ చేసి స్వేచ్ఛకు భంగం కలిగించారు. వారిద్దరినీ గ్రామాల్లోకి రానివ్వద్దు' అని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'రైతు భరోసా నిధులను హైదరాబాద్ శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం విడుదల చేయనున్నారు. రైతు భరోసా, రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయి' అని విమర్శించారు.

## ఫడ్నవిస్ ను కలిసిన పవన్ కల్యాణ్..
# రెండు ఆడ పులులు ఇచ్చేందుకు అంగీకారం

అమరావతి: ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా తూర్పు కనుమల్లో పులుల సంరక్షణతో పాటు ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల సంతానోత్పత్తి వంటి జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించి, పులుల సంఖ్యను పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడ పులులను ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దమనసుతో సహకారం అందిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు పవన్ కల్యాణ్ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల తూర్పు కనుమల్లో జన్యు వైవిధ్యం పెరిగి, దీర్ఘకాలిక స్థిరత్వంతో కూడిన ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి గల పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తమకు నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు కూడా ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాస్త్రీయ విధానాలతో జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయని, భవిష్యత్తులోనూ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## దేశాలు గనుక స్టాక్స్ అయితే.. నేను కళ్లు మూసుకుని
# ఇండియానే కొంటా: యూఎస్ సెనేటర్

ఢిల్లీ: "దేశాలను స్టాక్ మార్కెట్లో షేర్లలా చూస్తే, తాను కచ్చితంగా భారత్ షేరునే కొనుగోలు చేస్తాను" అంటూ అమెరికాకు చెందిన రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారత్ వేగంగా ఎదుగుతోందని, అమెరికాతో ఆ దేశ సంబంధాలు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్డీటీవీ' కథనం ప్రకారం.. వాషింగ్టన్ డీసీలో జరుగుతున్న యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ సెనేట్ ఎన్నికల ప్రచార విభాగానికి స్టీవ్ డైన్స్ అధిపతిగా ఉన్నారు. దీంతో ఆయన ట్రంప్ పార్టీ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయంగా కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. భారత్ ఆర్థిక వృద్ధిని ఉటంకిస్తూ ఆయన తన ప్రశంసలకు కారణాలను వివరించారు. "జీడీపీ దృష్ట్యా చూస్తే ప్రపంచంలోని టాప్ 20 ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఐదో స్థానంలో ఉంది. త్వరలోనే జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకోనుంది. అంతేకాదు, ఈ టాప్ 20 దేశాలలో ఈ ఏడాది, వచ్చే ఏడాది కూడా అత్యధిక జీడీపీ వృద్ధి రేటును నమోదు చేయబోయేది భారతే. అందుకే భారత్ ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోంది" అని డైన్స్ పేర్కొన్నారు. అయితే, ఇదే సదస్సులో మరో సందర్భంలో మాట్లాడిన డెమోక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి నేత రో ఖన్నా మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో భారత్-అమెరికా సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని ఆయన ఆరోపించారు. "ఇరాన్‌తో యుద్ధానికి దిగాలన్న ట్రంప్ విధానాలు పూర్తిగా విధ్వంసకరమైనవి. ఆ ప్రభావంతో భారత్‌లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నమ్మకం లేకపోతే భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ను అడగండి" అని 'ఏఎన్ఐ'ని ఉటంకిస్తూ రో ఖన్నా అన్నారు. ఒకవైపు డైన్స్ భారత్‌ను నమ్మకమైన భాగస్వామి అని, ప్రధాని నరేంద్ర మోదీతో సంబంధాలను బలోపేతం చేయడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు సుంకాలు విధించింది. ఈ సుంకాల వల్ల 2025 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధికి ఒక శాతం వరకు గండి పడవచ్చని ఆర్థికవేత్తలు అప్పట్లో అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సుంకాలు 18 శాతానికి తగ్గినా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే ఇది ఇంకా ఎక్కువే. అదేవిధంగా అమెరికాకు భారతీయ విద్యార్థులు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమని డైన్స్ చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం మాత్రం విద్యార్థి వీసాలు, హెచ్-1బీ వర్క్ పర్మిట్లపై కఠిన నిబంధనలు విధించింది. ఫారిన్ స్టూడెంట్స్ కోసం ఉద్దేశించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)ను తొలగించడం, హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ఒక లక్ష డాలర్లకు పెంచడం వంటి చర్యలు భారత విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భారతీయ అమెరికన్లపై పెరుగుతున్న ద్వేషపూరిత దాడుల గురించి ప్రశ్నించగా, "ద్వేషం ఏ రూపంలో ఉన్నా దానిని ఎదుర్కోవాలి. ఇక్కడ భారతీయ అమెరికన్లు చాలా సురక్షితంగానే ఉన్నారు" అని డైన్స్ సమాధానమిచ్చారు. అయితే, ఎఫ్‌బీఐ డేటాను విశ్లేషిస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో యాక్సియోస్ ప్రచురించిన నివేదిక ప్రకారం, 2015 నుంచి 2025 మధ్య ఆసియన్లపై ద్వేషపూరిత నేరాలు 195 శాతం పెరిగాయని తేలింది. ఈ నేపథ్యంలో సెనేటర్ వ్యాఖ్యలు, క్షేత్రస్థాయి వాస్తవాల మధ్య వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

# కాంగ్రెస్ పీఆర్ స్టంట్లు చూసి
# రైతులు అసహ్యించుకుంటున్నారు

హైదరాబాద్: రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగసభా? అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ని ఉద్దేశిస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రూ.2లక్షల రుణమాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారు. ఢిల్లీ టూర్లు, పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి దృష్టి మళ్లించేందుకు చేపట్టే చర్యలు ఏమాత్రం పనిచేయవు. కేసీఆర్ ఠంచనుగా 11 సార్లు రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఓటు పోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు..

మొదటి పేజి తరువాయి

తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని ప్రజలను కోరారు. ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. కర్ణాటకలో మంగళవారం నుంచి సర్ ప్రారంభమైంది. జులై 29 వరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ "ఓటు హక్కు అంటే జీవించే హక్కు" అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ఆధారంగా అర్హత లేని రేషన్ కార్డుదారులను తొలగించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. అందుకే ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. దీన్ని ఆన్‌లైన్‌తో పాటు సేవా కేంద్రాల ద్వారా కూడా పొందే అవకాశం కల్పించింది. ఓటరు వివరాల ధ్రువీకరణలో ఇది నివాస ఆధారంగా ఉపయోగపడనుంది. ఈ దశలో ఎలాంటి పత్రాలు తీసుకోబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఫారం పూర్తిగా నింపి సంతకం చేసి అధికారులకు అందజేయాలని ఓటర్లను కోరింది. మొత్తం ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని అధికారులు తెలిపారు. ఆగస్టు 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుంది. సెప్టెంబర్ 4 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 7న ప్రకటించనున్నారు.

## హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి..
# సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్: తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధీ పెవిలియన్‌లో రేవంత్ రెడ్డిని మంగళవారం సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణలపై సీఎం వివరించారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్న సీఎం విద్యా రంగంలో చేపడుతున్న మార్పులను కూడా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకకరణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి కూడా సునీల్ మిట్టల్‌కు వివరించారు. అలాగే ఐటీఐలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మారుస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునీకరిస్తున్నామని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్ కూడా తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు.

# మూసీ పరిహారం..
# పునరావాసంలో రాజీపడం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూములు కోల్పోయే వారికి చట్టబద్ధంగా పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడబోదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మూసీ భూసేకరణ, పునరావాసంపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు... మూసీ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ఎవరి జీవితాలూ దెబ్బతినకుండా ప్రతి నిర్ణయాన్ని మానవీయ కోణంలోనే తీసుకుంటాం. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. పర్యాటక, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా దీన్ని మార్చాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యం. మూసీ కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరదల సమయంలో పరీవాహక ప్రాంతాల వారు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. వరద నియంత్రణ, నీటిశుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా పరీవాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది' అని వివరించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్లు ప్రియాంక, నారాయణరెడ్డి, మనుచౌదరి పాల్గొన్నారు.

## మంగళగిరిలో ఓడిపోయాక ఎంతో బాధపడ్డా..
# దేవాన్ష్‌తో చెస్ ఆడితే పరువు పోయింది

అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తన కుమారుడు దేవాన్ష్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధం, తన రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులపై చేసిన కొన్ని ఆసక్తికరమైన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఇటీవల టెన్త్, ఇంటర్ పరీక్షల్లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చిన ప్రభుత్వ స్కూళ్ల టాప్ స్టూడెంట్స్ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో లోకేశ్ తన కుటుంబానికి చెందిన విషయాలతో పాటు రాజకీయ, విద్యా వ్యవస్థకు సంబంధించిన ఎన్నో విషయాలను ఓపెన్‌గా షేర్ చేసుకున్నారు. ఇంట్లో తాను, తన కుమారుడు దేవాన్ష్ ఇద్దరం తండ్రీకొడుకుల్లా కాకుండా ఎప్పుడూ అన్నదమ్ముల్లా కొట్టుకుంటూ ఉంటామని లోకేశ్ సరదాగా నవ్వించేశారు. సాధారణంగా పిల్లలకు తండ్రులు సలహాలు ఇస్తుంటారు కానీ, తాను మాత్రం దేవాన్ష్‌కు ఎలాంటి సలహాలు ఇవ్వనని.. ఆ హోమ్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలను తన భార్య బ్రాహ్మణియే పక్కాగా చూసుకుంటుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ఒకసారి దేవాన్ష్‌తో తాను చెస్ గేమ్ ఆడి ఘోరంగా ఓడిపోయానని.. ఆ దెబ్బతో కొడుకు ముందు తన పరువంతా పోయిందంటూ ఆయన చెప్పడంతో... అక్కడ ఉన్న స్టూడెంట్స్, పేరెంట్స్ అందరూ నవ్వుకున్నారు. 2019 ఎన్నికల్లో తాను మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయినప్పుడు తీవ్రమైన మానసిక ఒత్తిడికి, బాధకు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. కానీ ఆ ఓటమితో కుంగిపోకుండా, పట్టువదలకుండా ఐదేళ్ల పాటు గ్రౌండ్ లెవెల్‌లో జనం మధ్యే ఉండి నిరంతరం కష్టపడటం వల్లే.. మొన్నటి ఎన్నికల్లో ఏకంగా 91 వేల భారీ మెజారిటీతో పబ్లిక్ తనను గెలిపించారని చెప్పారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని లేదా ఫెయిల్ అయ్యామని స్టూడెంట్స్ ఎవరూ సూసైడ్స్ లాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని..'FAIL' అంటే 'First Attempt In Learning' (నేర్చుకోవడంలో మొదటి ప్రయత్నం) అంటూ విద్యార్థుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. తాను కూడా భారతీయ విద్యా వ్యవస్థ కంటే అమెరికా ఎడ్యుకేషన్ సిస్టమ్‌లోనే ఎక్కువగా సక్సెస్ అయ్యానని తన స్వీయ అనుభవాన్ని పంచుకున్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వంద రోజుల్లోనే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేలా 'వన్ క్లాస్, వన్ టీచర్' లాంటి ఎన్నో సంస్కరణలు తెచ్చామని లోకేశ్ గర్వంగా చెప్పుకొచ్చారు. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లు అంటే చిన్నచూపు ఉండేదని.. కానీ ఈరోజు ప్రైవేట్ స్కూళ్లను మించి గవర్నమెంట్ స్టూడెంట్స్ రికార్డులు క్రియేట్ చేయడం వెనుక టీచర్లు, తల్లిదండ్రుల కష్టం ఉందని ప్రశంసించారు.

# రండి, జూలై 03న శ్రీగిరి గిరిప్రదక్షిణ చేద్దాం

**- భక్తులకు శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ పిలుపు**



నేటి శుభోదయ ::: నిజ జ్యేష్ఠ మాసం బహుళ తదియ, జూలై 03వ తేదీ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, శోభాయమానంగా జరుగుతుందని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్దగల శ్రీ బాపూజీ గోశాల వద్ద గోపూజ నిర్వహించి భక్తులందరూ సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి భక్తులు తమ భుజస్కంధాలపై పల్లకి మోస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ నగరోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంతటి మహిమాన్వితమైన రోజున సకుటుంబ సపరివార సమేతంగా సామూహికంగా శ్రీవారి నామస్మరణ చేస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాల్సిందిగా కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. స్వామివారి నక్షత్రం రోజున సామూహికంగా భక్తి ప్రపత్తులతో శ్రీగిరి గిరిప్రదక్షిణ చేసి శ్రీవారిని దర్శించుకోవడంతో శారీరక మానసిక స్థితి మెరుగై ఆరోగ్యం సిద్ధిస్తుందని, హిందూ సంప్రదాయాలు తెలుస్తాయని, ఐక్యత బలపడుతుందని వివరించారు.

# రాష్ట్ర రైతు ఉద్యమాలను దిశా నిర్దేశం చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

**- జూలై 3,4,5 తేదీల్లో ఏలూరు వేదికగా రైతు మహాసభలు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరం**




ఏలూరు, నేటి శుభోదయ ::: రాష్ట్ర రైతుల ఉద్యమాలకు జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయని, ఈ మహాసభ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏలూరులోని అల్లూరి సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జులై 3న మధ్యాహ్నం గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి హాలో రైతన్న - చలో ఏలూరు పేరుతో రైతు మహా ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో జీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఏ పంటకు కనీస ధర రావడం లేదన్నారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, మామిడికి తగిన ధర రాలేదని, పొగాకు రైతులకు పొగ పెడుతున్నారని విమర్శించారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వాలు కల్పించాయన్నారు. ఫీడ్ ధరలు పెంచిన ఆక్వా మేతల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. పర్చేజింగ్ పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కోకో రైతులకు తగిన ధర రాలేదని, కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలన్నారు.ఆయిల్ పామ్ రైతులకు ఆయిల్ రికవరీ శాతం పేరుతో కంపెనీల దోపిడీ ఆపాలన్నారు. అమెరికాతో భారత్ జులై మొదటి వారంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించారని, ఈ ఒప్పందం వలన మన దేశ వ్యవసారంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతులు నష్టపోతారని ఆందోళన చేశారు. పాలు,పాల పదార్థాల పెటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతాయని, పాడి పరిశ్రమ,పాడి రైతులు దివాళా తీస్తారని చెప్పారు. మొక్కజొన్న,సోయాబీన్,పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే ఇప్పటికే నష్టపోతున్న ఆయా పంటల రైతులు మరింత నష్టపోతారని అన్నారు. అమెరికాతో స్వేచ్ఛా ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో స్థితిగతులు చర్చించి భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రైతు రక్షణ,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో కీలకపాత్ర వహిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతుల రక్షణ కోసం నూతన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం నాయకులు ఆర్.లింగరాజు, ఎం. నాగమణి, పి.రామకృష్ణ, డి.ఎన్.వి.డి ప్రసాద్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్మనీ దేశంలో ఉద్యోగం కోసం వెళ్తున్న శ్రావణికి కంగ్రాట్స్ చెప్పిన ఎంపీ డాక్టర్ శబరి



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల గ్రామానికి చెందిన చిక్కోండు శ్రావణి జర్మనీ దేశంలో ఉద్యోగం కోసం వెళుతూ మంగళవారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ని మర్యాద పూర్వకంగా శ్రావణితో పాటు ఆమె తల్లిదండ్రులు చిట్టెమ్మ, నరసంహులు కలిశారు. బి ఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి జర్మనీ దేశంలో ఉద్యోగం కోసం వెళుతున్నానని శ్రావణి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వివరించగా వెంటనే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రావణి కి కంగ్రాట్స్ చెప్పి, జర్మనీ దేశం లో ఉద్యోగం చేస్తున్న అమ్మా, నాన్నలను దృష్టిలో పెట్టుకొని, ఉన్నత స్థానం చేరుకోవాలన్నారు.

# పేద రోగులకు సీఎం చంద్రబాబు దేవుడిలాంటి వారు

**– సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, నేటి శుభోదయ ::: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా పేద రోగులు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదు అన్న ఉద్దేశ్యంతో తాము సిఫారసు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ ను వెంటనే మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద రోగులకు దేవుడిలాంటి వారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.మంగళవారం నంద్యాల బొమ్మలసత్రం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. కురుకుంల అది లక్ష్మి రూ. 2,13,726 లు, బుర్రరెడ్డిపల్లి, దొర్నిపాడు, కాంద్రె విజయ (మరణం) కాంద్రె రాముడు రూ. 4,07,355 గంజికుంట, మైదుకూరు. కారకుల వరుణ్ తేజ్ రూ. 20,484 లు నీలివీధి, నంద్యాల, నూకల రాఘవేంద్ర రెడ్డి రూ.96,199లు సాయిబాబా పేట, నందికొట్కూరు, అంబటి శేఖర్ రెడ్డి రూ. 92,883 లు ఈర్నపాడు, బండిఆత్మకూరు కంపమల్ల షేక్ రేష్మ రూ.55,000లు తిమ్మాపురం, మహానంది, గుర్రం రామ సుబ్బమ్మ రూ. 65,000 లు మంచాలకట్ట, గడివేముల, సయ్యద్ మీర్ ఎండీ ఇస్మాయిల్ రూ. 55,000 లు ఎన్ జి ఓ కాలనీ, నంద్యాల, పెద్దిరెడ్డి గారు హనీషా రెడ్డి రూ. 41,580 లు లక్ష్మీపురం పగిడ్యాల, షేక్ మహబూబ్ పీరా రూ.51,258లు రామతీర్థం, బనగానపల్లి, లింగాల తేజేశ్వర రెడ్డి రూ.61,709లు, రైతునగరం, నంద్యాల, బోయ మురళీ రూ. 45,795లుకోటపాడు, సిరివెళ్ల, బుషాకు భరత్ కుమార్ రెడ్డి రూ.71,900లు, కానాల, నంద్యాల, ఎస్. ప్రమీలమ్మ రూ.37,551లు, భీమవరం, నంద్యాల, పిట్టల నాగమద్దిలేట్టి (డెత్), పిట్టల జయలక్ష్మమ్మ రూ. 35,800లు తెలుగుపేట, నంద్యాల, నల్లవారి రామక్క రూ. 65,405లు కానాలపల్లి, గోస్పాడు, గండ్ల వరలక్ష్మమ్మ రూ. 1,08600 లు, వాడాల, పాములపాడు, ఇలా మొత్తం 17 మంది బాధితులకు రూ. 15,25,245 లక్షల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బాధితులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న భాధితులు సీఎం చంద్రబాబు నాయుడుకు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి



గన్నవరం, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. గన్నవరం మండలం బి. బి. గూడెం గ్రామ సమీపంలో ఉన్న వెస్టుబైపాస్ పై మంగళవారం లారీ, స్కూటీ, కారు పరస్పరం ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించే ప్రక్రియ కొనసాగుతోంది.

# 18 గంటల్లో యాప్ సమస్య పరిష్కారం

**-ఎమ్మెల్యే రాముకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కృతజ్ఞతలు**



గుడివాడ జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రజలకు మంచి చేయడంలో పార్టీలు, వర్గాలు చూడనని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. గుడివాడ అభివృద్ధి తన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.ట్రాక్టర్ ట్రైలర్స్, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ టెంపరరీ రిజిస్ట్రేషన్ కోసం వాడే యాప్ ఓపెన్ కాకపోవడంతో ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 18 గంటల్లోనే పరిష్కరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు మంగళవారం స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పెద్దలు ప్రజా వేదిక కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఇటీవల ఎమ్మెల్యే రాము దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీంతో 18 గంటల్లోనే యాప్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి.అసోసియేషన్ పెద్దలు మాట్లాడుతూ యాప్ పనిచేయకపోవడంతో వ్యవసాయ ఆధారిత వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు కాక రైతులకు అందించలేక తీవ్ర ఇబ్బంది పడ్డామని తెలిపారు. వ్యవసాయ సీజన్ మొదలవుతున్న సమయంలో సమస్య పరిష్కారం కావడంతో ఊరట లభించిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఫోర్ వీలర్ నమోదు అవకాశాన్ని కూడా గుడివాడలోనే ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు. సకాలంలో వాహనాలు అందడంతో రైతులు కూడా సంతోషంగా ఉన్నారని చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ పార్టీలు, వర్గాలు చూడకుండా సమస్యలపై తన వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికీ తన శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. చిన్న తరహా పరిశ్రమలు గుడివాడకు వెన్నెముక లాంటివని, వాటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడటం తన బాధ్యత అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుని ఇలాంటి సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుడివాడ అభివృద్ధి, ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా తామంతా ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లం రామ్మోహన్రావు, కార్యదర్శి చిన్న బాబు, కోశాధికారి నూగలాపు సురేష్, కోన శ్రీనివాస్, ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకులు, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో విజయవంతంగా

# ముగిసిన పల్స్ పోలియో కార్యక్రమం

**- 99.3 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు**

**: ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లాలో ఈ నెల జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.కార్యక్రమం తొలి రోజు అయిన జూన్ 28 (ఆదివారం) నిర్వహించిన పోలియో బూత్ లో పోలియో చుక్కలు వేయటం లో జిల్లాలోని 1,25,322 మంది 0--5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం లక్ష్యంగా ఉన్న 1,31,642 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రెండవ , మూడవ రోజుల్లో నిర్వహించిన గృహ సందర్శన లో జిల్లావ్యాప్తంగా 3,50,774 ఇండ్లను ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 298 ఇళ్లు ఎక్స్ మార్క్ ఇండ్లు, గా గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ ఇళ్లలో అందుబాటులో లేని చిన్నారులను యు ఐ పి లో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం లు తిరిగి సందర్శించి పోలియో చుక్కలు వేయడంతో పాటు, ఆయా ఎక్స్ మార్క్ లను పూర్తిగా తొలగించే చర్యలు చేపడతారని వెల్లడించారు.జిల్లాలో మొత్తం 1,31,642 మంది చిన్నారుల లక్ష్యానికి గాను 99.3 శాతం మేర పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన అర్హులైన చిన్నారులను కూడా త్వరితగతిన గుర్తించి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏ ఎన్ ఎం లు , ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించిన తల్లిదండ్రులందరికీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే యు. ఐ. పి. లో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని, పిల్లలకు నిర్దేశిత సమయానికి అన్ని టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దుర్గి ఎస్సై గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన

**బి.గోపాల్ ను ఘనంగా సత్కరించిన..డాక్టర్ కుక్కమూడి ప్రసాద్**



నేటి శుభోదయ 30 జూన్ పల్నాడు జిల్లా దుర్గి:ఇటీవల దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.గోపాల్ ను మంగళవారం దుర్గి పోలీస్ స్టేషన్లో పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ శాలవాలతో ఘనంగా సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దుర్గి పోలీస్ స్టేషన్కు యంగ్ డైనమిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బి.గోపాల్ బాధ్యతలు చేపట్టటం గర్వంగా ఉందని అన్నారు. దుర్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహ పూర్వక సంబంధాలు ఉండే విధంగా చూడాలని, ఎస్సీ ఎస్టీలపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు రిపోర్ట్ ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలని,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, గ్రామాలలోని ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, వారు అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్నారని అందుచేత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటువంటి ప్రాంతాలలో చట్టాల పట్ల అవగాహన కలిగే విధంగా, యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని ప్రతినెల చివరి వారంలో గ్రామాల్లో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంలో పోలీస్ వారు హాజరయ్యే విధంగా చూడాలని సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు.ఎస్సై గోపాల్ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఎస్సై గోపాలకు అభినందనలు తెలియజేసిన వారిలో సీనియర్ దళిత నాయకుడు ఆరుమళ్ళ ఇశ్రాయేలు ఉన్నారు.

# వైసీపీ పాలనలో వినుకొండను అసాంఘిక శక్తుల అడ్డాగా మార్చిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజం.వైసీపీ పాలనలో వినుకొండ నియోజకవర్గాన్ని అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చి ప్రజలను భయాందోళనలకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**




నేటి శుభోదయ 30 జూన్ పల్నాడు జిల్లా వినుకొండ:వైసీపీ ప్రభుత్వ హయాంలో వినుకొండలో మహిళలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని జీవించాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందన్నారు.భూకబ్జాలు, పేకాట శిబిరాలు, గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలు, రౌడీయిజం, బెదిరింపులు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.వినుకొండలో శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీసి,భూకబ్జాలకు పాల్పడి, అక్రమాలకు అండగా నిలిచినందుకే ప్రజలు గత ఎన్నికల్లో బొల్లా బ్రహ్మనాయుడును చిత్తుగా ఓడించారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అక్రమ పేకాట స్థావరాలు, గంజాయి ముఠాలు, భూకబ్జాదారులపై పోలీసులు నిరంతరం ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన పోలీసు దాడుల్లో వైసీపీకి చెందిన నాయకుడు పేకాట నిర్వహిస్తున్న సమయంలో పట్టుబడటం, గత పాలనలో అక్రమాలకు ఎవరి అండ ఉందో స్పష్టంగా కనబడింది అన్నారు.భూములను ఆక్రమించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అతిక్రమించే వారు ఎంతటి రాజకీయ నాయకులైనా చట్టం ముందు సమానమేనని వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు.నుకొండలో శాంతిభద్రతల పునరుద్ధరణ, మహిళల భద్రత, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే తమ ధ్యేయమన్నారు.

# బాలినేని శ్రీనివాసరెడ్డి వినుకొండ పర్యటనను విజయవంతం చేయండి - జనసేన సమన్వయకర్త నాగశ్రీను రాయల్



నేటి శుభోదయ 30 జూన్ పల్నాడు జిల్లా వినుకొండ :నరసరావుపేట పార్లమెంట్ జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి నేడు అనగా 01-07-2026, బుధవారం సాయంత్రం 4గంటలకు వినుకొండ పట్టణం, తిమ్మయపాలెం రోడ్ లో గల కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నందు జరగబోయే వినుకొండ నియోజకవర్గం జనసేనపార్టీ సమావేశానికి ముఖ్య అతిథిగా విచేయుచున్నారు. కావున వినుకొండ నియోజకవర్గం మండల పార్టీ, గ్రామ పార్టీ, పట్టణ పార్టీ, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వీర మహిళలు, సీనియర్ నాయకులు, వివిధ హోదాలలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ యొక్క సమావేశాన్ని విజయవంతం చెయ్యగలరు.కొంజేటి నాగశ్రీను రాయల్జనసేనపార్టీ సమన్వయకర్త వినుకొండ నియోజకవర్గం

# కొడాలి నానికి ఏపీ హైకోర్టులో భారీ ఊరట

అమరావతి, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కొడాలి నానిపై గుడివాడలో నమోదైన కేసులో స్టే విధించిన ఏపీ హై కోర్టు.కొడాలి నానిపై ప్రభుత్వం అనుమతించిన ప్రాసిక్యూషన్ పై స్టే విధించిన ఏపీ హైకోర్టు.కొడాలి నానిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.2021 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉండగా చంద్రబాబు,ఎన్నికల కమీషనర్ నిమ్మగడ్డ రమేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కొడాలి నానిపై కేసు నమోదు చేయడం జరిగింది.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద నానిపై చర్యలు తీసుకోవాలంటూ నాడు కృష్ణా జిల్లా ఎస్పీకి నివేదిక ఇచ్చిన రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవ్వడం జరిగింది.ఈసీ ఆదేశాలతో 2021 ఫిబ్రవరి 16న కొడాలి నానిపై కేసు నమోదు చేశారు. తాజాగా నానిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించిన ఏపీ హైకోర్టు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వేగవంతం చేయాలి

**-కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**-గూడూరులో సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**



గూడూరు జూన్ 30 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఎన్నికల సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం పెడన నియోజకవర్గంలోని గూడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల విభాగం అధికారులతో కలిసి ఇంటింటి సర్వే తీరును పరిశీలించి, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి సేకరణ, డేటా డిజిటైజేషన్ పురోగతిపై ఆరా తీశారు.సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డేటాను డిజిటైజ్ చేయాలని బీఎల్‌వోలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన ఫారాల వివరాలను అడిగి తెలుసుకుని, ఇంకా మిగిలిన ఫారాలను సంబంధిత ఓటర్ల నుంచి త్వరితగతిన సేకరించి నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందేలా చూడాలని, ఎవరూ మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఫారాల సేకరణ అనంతరం వాటిని సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని చెప్పారు.సర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని పేర్కొన్న జిల్లా కలెక్టర్, అధికారులు సమన్వయంతో పనిచేసి నాణ్యతతో కూడిన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట ఇంచార్జ్ డిఆర్ఓ పి పోతురాజు, గూడూరు మండల తహసిల్దార్ డి రాజ్యలక్ష్మి, ఎంపీడీవో టి శైలజ కుమారి, డిప్యూటీ ఎంపీడీవో చండిక ఉమామహేశ్వరరావు, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

# ఖరీఫ్ సీజన్ పై అధికార యంత్రాంగం దృష్టి పెట్టండి

-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-కృష్ణా డీడీఓ జ్యోతి రమణి ఎమ్మెల్యే రాముతో మర్యాదపూర్వక భేటీలి

77రైతు సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తా: ఎమ్మెల్యే రాములి

ఎరువులు, యూరియా కొరత లేకుండా చూడండి... అధికారులకు ఎమ్మెల్యే సూచనలు



గుడివాడ, జూన్ 30( అజయ్ నారగాని /ప్రస్తుతం ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ పై అధికార యంత్రం దృష్టి పెట్టాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా, గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కృష్ణా జిల్లా వ్యవసాయ అధికారి (డీడీఓ)గా బాధ్యతలు చేపట్టిన కే.జ్యోతి రమణి మంగళవారం ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీడీఓ ఎమ్మెల్యేల రాముకు పుష్పగుచ్చారా స్థానంలో నోట్ పుస్తకాలు అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో అధికారులు చేసే కృషికి తాను పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే రాము తెలిపారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతాంగానికి మేలు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. ఎరువులు, యూరియా కొరత రాకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గుడివాడ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.కవిత, ఏవోలు భాను ప్రకాష్, అనంతలక్ష్మి డీడీఓ వెంట ఉన్నారు.

# ఏపీజీఈఏ అధ్యక్షుని చొరవతో ఇంటర్మీడియట్ లెక్చరర్లకు డిగ్రీ లెక్చరర్ల గా పదోన్నతులు



అమరావతి, జూన్ 30( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఇంటర్మీడియట్ లెక్చరర్లకు నిబంధనల ప్రకారం డిగ్రీ కాలేజీ లెక్చరర్లు గా పదోన్నతి అవకాశం ఉన్నప్పటికీ గత 13 సంవత్సరాలుగా అనగా రాష్ట విభజన తర్వాత అమలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ అన్నారు.ఈ విషయంలో మన మహిళా విభాగం అధ్యక్షురాలు డా. పామర్తి లీలావతి తో సహా కొందరు రాష్ట్ర హై కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందినప్పటికీ ఆ శాఖలో అమలు చేయడంలేదన్నారు. డీ.ఎల్. ఐక్యవేదిక సభ్యసంఘం లెక్చరర్స్ అసోసియేషన్ వారి అభ్యర్థన మేరకు సంఘం గత నెలలో సంబంధిత అధికారులు అందరికీ రిప్రజెంట్ చేయడం జరిగిందన్నారు. అయినా వివిధ కారణాలతో ఈ పదోన్నతులు అమలు చేయడం లేదన్నారు. సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ నేతృత్వంలో 100 మంది వివిధ జిల్లాలకు చెందిన జూనియర్ లెక్చరర్లు డిగ్రీ కాలేజీ కమిషనర్ ను నిలదీయడం జరిగింది. అధ్యక్షులు ఐఏఎస్ అధికారి భరత్ గుప్తాకి గట్టి హెచ్చరిక చేశారు. ఈ విషయం రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. మంత్రి నారా లోకేష్ జులై 5 తేదీ లోగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించి, ఓ ఎస్ డి ద్వారా రాష్ట్ర అధ్యక్షులకు సమాచారం ఇచ్చారన్నారు.పుష్కరకాలంగా పేరుకుని ఉన్న సమస్య ఏపీజీఎ చొరవ తో పరిష్కారం అయిందన్నారు.

# భారత రాష్ట్రపతి పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి.

-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..- బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ట్రయల్ రన్ పూర్తి..



అనంతపురం, జూన్ 30 : నేటి శుభోదయ:జులై 01వ తేదీన భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో మంగళవారం సెంట్రల్ యూనివర్సిటీలో ట్రయల్ రన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, రాష్ట్ర ఐ.ఎస్.డబ్ల్యు ఎస్పీ ఆరిఫ్, ఎయిర్ ఫోర్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ట్రయల్ రన్ లో భాగంగా కేంద్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి మెయిన్ గేట్ మీదుగా స్నాతకోత్సవ కార్యక్రమం వేదిక వద్దకు రాష్ట్రపతి కాన్వాయ్ ని తీసుకువెళ్లడం, అక్కడ ఏర్పాట్లు, రాష్ట్రపతి కాన్వాయ్ ని తిరిగి హెలిప్యాడ్ వరకు తీసుకువెళ్లడం లాంటివి విజయవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, స్నాతకోత్సవ కార్యక్రమం వేదిక, తదితర ప్రాంతాల వద్ద బందోబస్తు భద్రత, ఇతర అన్ని ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ప్రత్యేకంగా రూమ్లను ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ లో ఎలాంటి దుమ్ము లేవకుండా వాటరింగ్ నిత్యం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. కాన్వాయ్ లో ఏఏ వాహనాలు ఉండాలి, అందులో ఎవరెవరు అధికారులు ఉండాలి, కాన్వాయ్ ని ఎలా తీసుకెళ్లాలి, గ్రీన్ రూమ్ ఏర్పాటు, స్నాతకోత్సవ కార్యక్రమం వేదికలో సీటింగ్ ఏర్పాటు, తదితర అన్ని రకాల అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు తక్షణమే పూర్తి కావాలని ఆదేశించారు. అధికారులకు కేటాయించిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించి అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రపతి గారు పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, అడ్మిన్ ఏఎస్పి నాగభూషణం, ఏఆర్ అడిషినల్ ఏఎస్పి ఇలియాజ్ భాష, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు రామ్మోహన్, వసంతబాబు, ఆర్బీఎస్కె శ్రీనివాస, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కిరణ్మయి, రమేష్ రెడ్డి, డిపిఓ నాగరాజునాయుడు, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిటిసి వీర్రాజు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిసిఓ అరుణకుమారి, డిఎస్పిలు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల కలల రహదారి పనులపై గుత్తేదారు నిర్లక్ష్య వైఖరి

ఏడుగురాళ్లపల్లి – బోధునూరు రహదారి పనులు పై అవినీతి మరకలు.

చింతూరు డివిజన్ నేటి శుభోదయ: చింతూరు మండలం ఏడుగురాళ్ళపల్లి మీదుగా కూనవరం మండలం బోదునూరు - కోతులగుట్టకు రహదారి సౌకర్యం అనేది దశాబ్దాల కల. గోదావరి - శబరి నదులకు వరదలు వస్తే భద్రాచలం నుండి కూనవరం, వి. అర్. పురం మండలాలకు రహదారి సౌకర్యం లేకుండా పోతుంది. వరదల సమయంలో అత్యవసర వైద్య .సహాయంతో పాటు నిత్యవసర సరుకులు తరలించడం అనేది కత్తి మీద స్వాముల మారింది. దాంతో చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి నుంచి బోదునూరు మీదుగా కోతుల గుట్టకు రహదారి నిర్మాణం చేపట్టాలని 1956 లోనే సర్వేలు నిర్వహించారు. రిజర్వ్ ఫారెస్ట్ నుండి రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అభ్యంతరాలు పెట్టడంతో పాటు గతం నుంచి ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో ఈ రహదారి నిర్మాణం ముందుకు సగలేదు. ఒకప్పటి పనికి ఆహార పథకంలో తాత్కాలికంగా మట్టి రోడ్డును వేసి ముగించేశారు ఆ రహదారిపై వాహనాల ప్రయాణం వర్షాకాలంలో సాధ్యం కాకపోవడంతో ఏ దుగురాళ్లపల్లి కోతుల గుట్ట రహదారి కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ రహదారి నిర్మాణంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించడంతోపాటు జిల్లా కలెక్టర్ వంటి అధికారులు కూడా ఏడుగురాళ్లపల్లి నుంచి కోతుల గుట్ట వరకు రహదారి నిర్మాణం చేపట్టడానికి కావలసిన అడ్డంకులన్నీ తొలగించడానికి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. 2022 వరదల తరువాత ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలనీ అధికారులు పట్టుబట్టారు. దాంతో రహదారి నిర్మాణానికి సుమారు 698 లక్షలు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణాన్ని తెలంగాణ ప్రాంతానికి చెందిన గుత్తేదారుకు రహదారి నిర్మాణాన్ని అప్పగించారు.



ఏడుగురాళ్లపల్లిలోని అటవీ శాఖ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి ఎన్ హెచ్ 30 నుండి సుమారు 7 కిలోమీటర్ల పాటు ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొత్తం దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో చిన్నచిన్న వాగులు, కాలువలు ఉండటంతో సుమారు 19కలవర్టులు, 14 చప్టటాల నిర్మాణాన్ని చేపట్టారు. 698 లక్షలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణం అత్యంత నాసిరకంగా చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం నాసిరకంగా చేపట్టిన మరో ఐదేళ్ల కో,10 ఏళ్లకో మరోసారి రోడ్డు మంజూరు అయితే ఆ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపడతారు సమస్య పరిష్కారం అవుతుంది కానీ, కలకాలం ఉండాల్సిన కల్వర్టులను, చాప్ట లను నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో అవి నిర్మాణం పూర్తి కాకుండానే భీటలు వాలుతున్నాయి అంతేకాక అత్యంత తక్కువ సిమెంట్ కాంక్రీట్ వాడటంతో ఏ కలవర్టు ఎప్పుడు కూలిపోద్దో తెలియని పరిస్థితి.ఇప్పటికే అనేక కలవర్టులు పగులు రావడంతో పాటు రాళ్లు రప్పలతో పూడిపోయి ఉన్నాయి. కొన్ని కల్వర్టులు నిర్మాణం చేపట్టినప్పుడు పడిపోయిన సిమెంటు కల్వర్ట్లోని సగం పైపునిండా అడ్డంగా పూడ్చివేసింది అంటే మరి గుత్తేదారు ఉద్దేశం ఏమిటో అర్థం కావాలి. వరద నీరు ఇటువైపు నుంచి అటువైపుకు పోవాలనుకుంటున్నారా?లేక నీరు పోకుండా అక్కడే నిలిచిపోవాలనుకుం టున్నారా? అనేధి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ రహదారి నిర్మాణం పై దృష్టి సారించి ఏడు గుర్రాలపల్లి నుంచి బోదునూరు వరకు రహదారి నిర్మాణం కోసం నిర్మాణం చేపట్టిన పైపు కలవర్టులు,చప్టల నిర్మాణాన్ని సాంకేతికతను ఉపయోగించి వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించి లోపాలను పసిగట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



# జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి

ఉద్యాన పంటలు – ఫుడ్ ప్రాసెసింగ్ సదస్సులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

పండ్ల తోటలు సాగు చేసే ప్రతి రైతు లాభాలు చూడాలి

అనంత పురం జూన్ 30 నేటి శుభోదయ:హార్టీకల్చర్ హబ్ గా మారుతున్న అనంతపురం జిల్లాలో 5రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ కి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఉద్యాన పంటలు-ఫుడ్ ప్రాసెసింగ్-అవకాశాలు" అనే అంశం పై అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆర్.కే.ఫంక్షన్ హాల్లో జరిగిన కార్య నిర్వాహక సదస్సులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ఉద్యానశాఖ, ఎ.పి.ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, కాంటినెంటల్ కాఫీ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కాంటినెంటల్ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, ఉద్యానశాఖ అధికారులు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ముందుగా ఉద్యానపంటల ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ పై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఎమ్మెల్యే, ఎంపీ తిలకించారు. అనంతరం అక్కడే కాంటినెంటల్ కాఫీ తాగారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా ,ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉద్యాన పంటల ఉత్పత్తుల్లో



దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఇక్కడ సాగునీటి వనరులు తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ఎన్నో సాంకేతిక పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి నుంచి ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. జిల్లాకు డ్రిప్ విధానాన్ని పరిచయం చేసింది, ఇజ్రాయల్ తరహా టెక్నాలజీతో పంటల సాగును ప్రోత్సహించింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని తెలిపారు. గతంలో డ్రిప్ సరిగా ఇవ్వకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే 300కోట్ల రూపాయలతో డ్రిప్ రైతులకు అందించారన్నారు. ఏమారుమూల గ్రామంలో చూసినా డ్రిప్ విధానంలో సాగు కనిపిస్తుందన్నారు. జిల్లాలో నీటి కొరత లేకుండా తమ ప్రభుత్వంలో హంద్రీనీవా కాలువ మొదటి దశను పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కూడా 3500కోట్లతో కాలువను వెడల్పు చేసి అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చేస్తున్నారన్నారు. అయితే పండ్ల తోటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు లాభం రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక్క అరటి ఏడాదికి లక్షన్నర టన్నులు ఎగుమతి అవుతోందంటే జిల్లాలో ఏ విధంగా సాగవుతోందో తెలుస్తుందన్నారు. అయితే కొన్నిసార్లు ధరలు తగ్గిపోయిన సందర్భంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాటిని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లాలో 5రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని చల్లా రాజేంద్రప్రసాద్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. రైతుల కోసం నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు ఏర్పాటు చేసినా తమ వంతు సహకారం ఉంటుందని వారు తెలిపారు.

# 'బెస్ట్ అవైలబుల్' సీట్ల కేటాయింపులో భారీ అక్రమాలు

– పేద పిల్లల భవిష్యత్తు పై దెబ్బ కొడుతున్న కిందిస్థాయి సిబ్బంది

తమ బంధువులకే 'టాప్' కార్పొరేట్ స్కూళ్లు

– సామాన్యులకు చిన్న పాఠశాలలా

– లాటరీ ముందే 'సీట్ల' జిమ్మిక్కులు పూర్తి

– కలెక్టర్ సార్ స్పందించండి

– ప్రక్రియను రద్దు చేసి 'రీ-లాటరీ' నిర్వహించాలి : తల్లిదండ్రులు డిమాండ్

ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, మంచి ఆశయంతో ప్రవేశపెట్టిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' పథకం క్షేత్రస్థాయిలో అభాసుపాలవుతోంది అనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. పేద, దళిత వర్గాల పిల్లలకు కార్పొరేట్ విద్యాభాగ్యం కల్పించాలనే ప్రభుత్వ సత్సంకల్పానికి కొందరు కిందిస్థాయి ఉద్యోగులు తూట్లు పొడుస్తున్నారు. లాటరీ నిర్వహణ పేరుతో తెరవెనుక పెద్ద నాటకమే నడుపుతూ, అర్హులైన అనామక పేద పిల్లల భవిష్యత్తుతో ఆట ఆడుకుంటున్నారు. తమకు కావాల్సిన వారికి, సొంత బంధువుల పిల్లలకు పేరున్న పెద్ద కార్పొరేట్ స్కూళ్లలో సీట్లు వచ్చేలా ముందే 'ఫిక్సింగ్' చేసుకుంటున్నారనే ఘోరమైన నిజాలు వెలుగుచూస్తున్నాయి.




## - టాప్' స్కూళ్లు వాళ్లకే, సామాన్యులకు మొండిచేయే

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వందలాది మంది నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు దక్కుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, సీట్ల కేటాయింపు కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియ కేవలం కంటితుడుపు చర్యగానే సాగుతోందనే ఆరోపణలు అడుగు అడుగున వెల్లువెత్తుతున్నాయి. లోపాయికారీ ఒప్పందాలతో ఏ స్కూలు ఎవరికి కేటాయించాలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ముందే డిసైడ్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా, అన్ని వసతులు ఉన్న టాప్-క్లాస్ కార్పొరేట్ పాఠశాలల సీట్లన్నీ అధికారుల బంధుగణానికే దక్కుతున్నాయి. ఎలాంటి సిఫార్సులు లేని, పేద పిల్లలకు మాత్రం మౌలిక వసతులు సరిగ్గా లేని చిన్నపాటి స్కూళ్లను కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు.

## పారదర్శకత లేని లాటరీ విధానం

చీటీలు తీసే సాంప్రదాయ లాటరీ పద్ధతిలో సిబ్బంది తమకు అనుకూలమైన విధంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏయే స్కూళ్లలో ఎన్ని సీట్లు ఉన్నాయి? ఏ ప్రాతిపదికన కేటాయిస్తున్నారు? అనే కనీస సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచడం లేదు. అంతా రహస్యంగా, ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ సీట్ల దందా సాగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## - కలెక్టర్ సార్ తక్షణమే స్పందించండి

ఈ భారీ అవకతవకలపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని బాధితులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన లాటరీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన కిందిస్థాయి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం జరిగిన అపారదర్శక సీట్ల కేటాయింపును పూర్తిగా రద్దు చేసి, పునఃసమీక్ష చేయాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.ఇకనైనా ఇలాంటి అక్రమాలకు తావులేకుండా, అందరి సమక్షంలో, పూర్తి పారదర్శకంగా జరగాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.లాటరీ ముందే వారే చిట్టి మీద స్కూల్ పేరు అతని పేరు ముందే వ్రాసి అక్రమాలకు పాల్పడ్డారు. ఓ అధికారి బంధువులకు మాత్రం హార్వెస్ట్ స్కూల్లో సీట్లు వస్తాయి. అదేలా సాధ్యం ద్వారా అందరికీ సమానంగా, న్యాయబద్ధంగా సీట్లు చిట్టీలో నంబర్లు వేసి స్కూలు కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. నూతన ప్రక్రియను చేపట్టాలని పౌర సమాజం కోరుతోంది. అప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని, నిజమైన పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని బాధితులు నమ్ముతున్నారు.

# మహిళలు అభద్రతా భావాన్ని వీడాలి ఎస్ఐ లతాశ్రీ



చింతూరు డివిజన్ నేటి శుభోదయ: మహిళలు అభద్రతా భావాన్ని వీడాలని చింతూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ పేర్కొన్నారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన సదస్సుల నిర్వహణలో భాగంగా చింతూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు మహిళల భద్రత గూర్చి, చట్టాల గురించి అవగాహన కల్పించారు. అలాగే బాల్యవివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. బాలికలకు 18 బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే బాలికలకు వివాహాలు జరపాలని సూచించారు. అలాగే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల పై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు గూర్చి, మొబైల్లో మహిళలను ట్రాపింగ్ చేయడం గూర్చి అవగాహన కల్పించారు. మహిళలను ఎవరైనా వేధిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం మరువరాదని పేర్కొన్నారు. .112, తదితర నెంబర్లు కు ఫోన్ చేసి తెలపాలని అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. మైనర్ బాలికలపై అత్యాచారాలు చేస్తే ఫోక్సో చట్టం ద్వారా శిక్షింపబడతారని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టులు చేశామంటూ తమకు పైకం చెల్లించాలని కోరుతూ వాట్సాప్ లో కాల్స్ వస్తుంటాయని వాటిని ఎవరు లెక్క చేయవద్దని, అలా చేస్తే ఎకౌంట్లో ఉన్న డబ్బులు అన్ని మాయమవుతాయని పేర్కొన్నారు. ఇలాంటి కాల్స్ వస్తే తమకు తెలియజేయాలని కోరారు. మైనర్ బాలురు, బాలికలు లైసెన్సులేకుండా వాహనాలు నడిపితే వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు. మహిళలు చిన్న చిన్న సంఘటనలకు ఆవేశ పడిపోయి, మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ విధంగా చేసుకోవడం వల్ల పిల్లలు అనాధలవుతారని , తల్లిదండ్రులకు,చేసుకున్న భర్త వేదనకు గురవుతారని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకోవటం మంచిది కాదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ చదువు కొని ఉండాలని, మహిళ విద్యాభివృద్ధి సాధించినప్పుడే, ఆ కుటుంబంలోని పిల్లలు విద్యాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అమెరికా నుంచి స్వదేశానికి చేరుకున్న రామసేన అధ్యక్షులు 'కంబాల శ్రీనివాసరావు' దంపతులకు అపూర్వ స్వాగతం..!

– అడుగడుగునా పూలమాలలు, హారతులతో హిందూ అభిమానులు, మహిళల నీరాజనాలు..!!– మధురపూడి నుంచి గోకవరం వరకు సాగిన బైక్ ర్యాలీ...



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకొని భారతదేశానికి తిరిగి వచ్చిన విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు మంగళవారం మధురపూడి విమానాశ్రయంలో అపూర్వమైన స్వాగతం లభించింది. గత నెల 21వ తేదీన అమెరికా వెళ్లిన వారు పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకొని, భారతదేశానికి తిరిగి వచ్చారు. మంగళవారం మధురపూడి ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్పోర్ట్ వద్దకు రంపచోడవరం, రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి అభిమానులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కంబాల శ్రీనివాసరావు దంపతులకు పూలమాలలు వేసి, దుశ్శాలువాలు కప్పి, గజమాలతో ఘనంగా సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం మధురపూడి నుంచి బూరుగుపూడి, కోరుకొండ మీదగా, గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వరకు కంబాల శ్రీనివాసరావు దంపతులను బైక్ లతో ర్యాలీగా జై కంబాల నినాదాలతో తీసుకువెళ్లారు. అడుగడుగునా అభిమానులు నీరజనాలు పట్టారు. కోరుకొండ రామసేన కార్యాలయం వద్ద వందలాది మంది మహిళలు గుమ్మడికాయలతో హారతులు తీసి స్వాగతం పలికారు. మార్గంలో గ్రామ గ్రామానికి అభిమానులు, కార్యకర్తలు, మహిళలు హరతులు పట్టి, పుష్పాలు జల్లుతూ స్వాగతం పలికారు.

## కడప స్టీల్ ప్లాంట్ ను రాయలసీమకు అంకితం చేసిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు

**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, నేటి శుభోదయ ::: కడప స్టీల్ ప్లాంట్ ను రాయలసీమకు అంకితం చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు. రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే వైసీపీ నేత జగన్ రాయలసీమ ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. కడపకు స్టీల్ ప్లాంట్ తీసుకొస్తా, ఉద్యోగాలు కల్పిస్తా అంటూ వై ఎస్ జగన్ రాయలసీమ ప్రాంత ప్రజలను మోసం చేశారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధ్వజమెత్తారు. అయితే తెలుగుదేశం పార్టీ మొట్టమొదటి నుంచి ప్రజలు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతుందని. కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ ను రాయలసీమకు అంకితం చేసిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు.నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.కడప స్టీల్ ప్లాంట్ ను రాయలసీమకు అంకితం చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు.

## జీవిత దాతలు



మీరు..!
ప్రతి దినం మళ్లీ ప్రాణాన్ని పుట్టించువారు
మీరు
అందుకే మీరు మనిషిలో దేవుని రూపమే
మీరు..!

మీ సేవలే మానవతకు మధురమైన
స్నేహబంధం..!
మీ త్యాగమే జగతికి అమృతమైన జీవన
గంధం..!

వైద్యుల దినోత్సవ వేళ (జులై 1)...
మంజుల పత్తిపాటి వందనం మీకు..!
జన్మజన్మల కృతజ్ఞతల పుష్పం మీకు..!

జనజీవన జ్యోతి మీరు..!
వేదనల వేళ వెలిగే వెలుగు కీర్తి మీరు..!
మీరు చేసిన త్యాగములు ఎవరు
లెక్కించలేనివి
కానీ ప్రతి రోగి గుండెల్లో ఒక మాట...
"డాక్టరు లేకపోతే నేను లేను" అనే
సత్యమే,
ప్రాణాల పక్షికి పరమ ఆశయ దీపమే

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.

## అనాథ చిన్నారులకు అండగా పాత్రికేయులు

**: మానవత్వం చాటుకున్న జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్**



యాడికి, జూన్ 30 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :విధి వక్రించి తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన నలుగురు చిన్నారులకు పాత్రికేయులు అండగా నిలిచారు. జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి, 'మాటకోసం' దినపత్రిక ఎడిటర్ జోగిరెడ్డి తన మిత్రబృందంతో కలిసి ఆ చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. యాడికి మండల పరిధిలోని పెద్దపేట గ్రామానికి చెందిన శివప్రసాద్‌ను ఆయన భార్య హైమావతి కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో హత్య చేసి జైలు పాలైన విషయం విదితమే. ఈ దుర్ఘటనతో తండ్రి మృతి చెంది, తల్లి జైలుకెళ్లడంతో వారి నలుగురు పిల్లలు (ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు) దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ హృదయ విదారక పరిస్థితికి చలించిపోయిన స్థానిక సీఐ శ్రీనివాసులు ఆ చిన్నారులను అక్కున చేర్చుకున్నారు. ముగ్గురు ఆడపిల్లలను యాడికిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ) లో, కుమారుడిని పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న 3వ నెంబర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదువుకునే అవకాశం కల్పించారు.ఈ నేపథ్యంలో అనాథలుగా మారిన ఆ చిన్నారుల చదువులకు తనవంతు సహాయం అందించాలన్న ఉద్దేశ్యంతో జోగిరెడ్డి (శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్టూడెంట్ మార్ట్ యజమాని) వెంటనే స్పందించారు. మంగళవారం తన పాత్రికేయ మిత్రులతో కలిసి కేజీబీవీ పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరామర్శించారు. వారిలో మనోస్థైర్యాన్ని నింపుతూ, "మీకు మేమంతా ఉన్నాం. కష్టాలను అధిగమించి చదువుపై దృష్టి పెట్టండి. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి" అని ధైర్యం చెప్పారు. అనంతరం నలుగురు చిన్నారులకు అవసరమైన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రితో పాటు తినుబండారాలను అందజేశారు. వారి భవిష్యత్తు చదువులకు సైతం పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ... అభాగ్యులైన పిల్లల చదువు కోసం దాతలు ముందుకు రావాలని కోరుతూ కేవలం వార్తలు రాయడమే కాకుండా, సామాజిక బాధ్యతగా తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.భవిష్యత్తులోనూ ఇలాంటి అనాథ పిల్లలకు అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్నారులకు అండగా నిలిచిన పాత్రికేయుల బృందానికి కేజీబీవీ ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ) నిర్మల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన పాత్రికేయ ధర్మమని నిరూపించిన జోగిరెడ్డి, శివషణ్ముఖ రెడ్డి, శ్రీనివాసులు గౌడ్, నూర్‌భాషా మహమ్మద్ ఫారుక్, కుండా లక్ష్మీనారాయణ, ప్రెస్ సీనా,మూలింటి శివప్రసాద్,రాయుడు,రహంతుల్లా, బండారు బాలకృష్ణ,రామకృష్ణ,ధనుంజయ,నాగేశ్వరయ్య ఆయన మిత్రబృందాన్ని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా అభినందిస్తున్నారు.

## ఈ నెల 26న శ్రీ కనకదుర్గమ్మకు తెలంగాణా బోనాలు సమర్పణ



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- హైదరాబాద్ లోని భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యుల బృందం మంగళవారం శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం బోనాలు కమిటీ చైర్మన్ మధు సూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ని కలిసి 16 సంవత్సరాలనుండి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈ సంవత్సరం కూడా శ్రీ కనక దుర్గమ్మవారికి బోనాలు సమర్పిస్తామని, ఈ నెల 26 న కార్యక్రమం నిర్వహించేందుకు హైదరాబాద్ నుండి వస్తామని తెలియజేస్తూ సమాచారం లేఖ అందజేశారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న ఎం.హరిజవహర్ లాల్ కుటుంబం



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ డాక్టర్ ఎం. హరిజవహర్ లాల్ మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చక బృందం స్వాగతం పలికారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## బి ఎల్ వో లు, బిఎల్ఏ ల సమన్వయ సమావేశం



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ డీఈఓ, సెంట్రల్ ఈఆర్వో ధ్యానచంద్ర ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఏఈఆర్వోలు మంగళవారం ఉదయం తమ తమ నియోజకవర్గాల్లో బీఎల్వోలు, బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఈఆర్వోలు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేయడంతో పాటు, ఫారాన్ని ఓటరే స్వయంగా నింపి బీఎల్వోకు తిరిగి అందజేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఎలాంటి సందేహాలు తలెత్తినా వెంటనే సంబంధిత ఏఈఆర్వో దృష్టికి తీసుకురావాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. బీఎల్ఏలు కూడా తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిరోజు పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వోలు అధికారులను ఆదేశించారు.

## నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు




విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని ప్రధాన కాలువలు, అవుట్‌ఫాల్ డ్రెన్లు, అంతర్గత డ్రెన్లలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.మంగళవారం నగరంలోని వాంబే కాలనీలో డీసిల్టింగ్ మెషిన్‌తో, బుడమేరు కాలువలో లాంగ్ ఆర్మ్, ట్రక్సర్ తో గుర్రపు డెక్కలు, బోట్ల సహాయంతో బందర్ కాలువ, ఏలూరు కాలువల్లో,ఎక్స్‌కవేటర్‌తో, ప్రతి సర్కిల్లో తేలియాడే వ్యర్థాలను తొలగించే, డీసిల్టింగ్ పనులు చేపట్టామని తెలిపారు. అలాగే నగరంలోని అన్ని ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని చెప్పారు.ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెన్లలోకి వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా, చిన్న డ్రెన్ల నుంచి పెద్ద కాలువల వరకు నీటి ప్రవాహానికి అంతరాయం కలిగించే పూడిక, చెత్త, ఇతర అడ్డంకులను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా కనెక్టివిటీ లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిచేసి, వర్షపు నీటి పారుదలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ఒకవైపు డీసిల్టింగ్ పనులు కొనసాగిస్తూనే, మరోవైపు వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారంగా అవసరమైన చోట కొత్త డ్రెన్ల నిర్మాణ పనులు కూడా చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ గల్భర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని చెప్పారు.మాన్సూన్ రెస్పాన్స్ టీం నిరంతర పర్యవేక్షణలో వర్షం కురిసిన వెంటనే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి, నీటిని వేగంగా తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

## ఖమ్మం నగరంలో అనేక చోట్ల అక్రమ కట్టడాల రాజ్యం

**- ఖమ్మం నగర పాలక సంస్థ కు చెందిన అధికారులు మౌనమేల**

**-- "రూల్స్ పక్కన పెట్టి రాత్రికి రాత్రే భవనాలు, టౌన్ ప్లానింగ్‌కు కనిపించడంలేదా**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో అనేక చోట్ల అక్రమ కట్టడాలను యదేచ్ఛగా కొనసాగిసున్నా కనీసం అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. అనుమతులు లేకున్నా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఎవరి అండతో ఈ దందా కొనసాగుతోంది అనే అనుమానం కలగమానదు. నోటీసులు ఇచ్చినట్లు నటన, అక్రమ కట్టడాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఖమ్మం నగరంలో గల మయూరి సెంటర్, బైపాస్ రోడ్డుపై భవిష్యత్తు ట్రాఫిక్ సంక్షోభానికి బీజం వేస్తున్న అక్రమ నిర్మాణాలు. మామూళ్లు వస్తే చాలు, నిబంధనలు గాలికొదిలేస్తున్నారా అధికారులు. టౌన్ ప్లానింగ్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు గా వివరిస్తోంది. బైపాస్‌పై బిల్డింగ్ బూమ్ కొనసాగుతున్న అనిశ్చితి నెలకొంది. రాజకీయ ఒత్తిళ్లకే తలొగ్గారా చర్యలు తీసుకోని అధికారులపై ప్రశ్నలు వస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. కూల్చివేతలు ఎందుకు లేవు అనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి. ఖమ్మం నగరంలో బైపాస్‌లో అక్రమ కట్టడాల జాతర కొనసాగుతుంది . ఉన్నతాధికారులు స్పందిస్తారా అనే అనుమానం కలగమానదు. అధికారుల ఆశీస్సులేనా బైపాస్ రోడ్డు పక్కన యథేచ్ఛ నిర్మాణాలు కొనసాగుస్తునారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. నోటీసులు ఒకవైపు, నిర్మాణాలు మరోవైపు.. ఇదేనా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తీరు పట్ల ప్రజల్లో సహజంగా విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. బైపాస్ రోడ్డు ఆక్రమణల బారిన, భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నారు. అక్రమ కట్టడాలపై అధికారుల కరుణ ఉండటంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం బైపాస్‌లో బిల్డర్ల దూకుడు, చట్టాలు కాగితాలకే పరిమితమా అని అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళన కోసమే 'సర్'

**బీఎల్‌వోలకు వివరాలు అందచేయాలి. ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- ఓటర్ల జాబితాను సమగ్రంగా ప్రక్షాళన చేసేందుకు 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. బీఎల్‌వోలకు ప్రజలకు పూర్తిగా సహకరించి వివరాలు అందచేయాలన్నారు. మంగళవారం ఉదయం 4వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను గద్దె ఆదేశించారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ సర్ కార్యక్రమం తూర్పు నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని బీఎల్‌వోలు ఒకొక్క ఇంటికి రెండు, మూడు సార్లు తిరిగి వివరాలు సేకరిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నారన్నారని చెప్పారు. ఓటు తొలగించాలనే ఉద్దేశ్యం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలని, దాని ద్వారానే ఎన్నికల్లో ప్రజాభిప్రాయం ప్రస్ఫుటం అవుతుందని చెప్పారు. 2002 ఓటర్ల జాబితాను సరిచూసుకుంటూ బీఎల్‌వోలు ఎంతో శ్రమ పడుతూ ఇంటింటికి తిరుగుతున్నారని, ప్రజలు కూడా బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. ప్రజలు సహకరిస్తే 'సర్' కార్యక్రమాన్ని త్వరగా, సమగ్రంగా ముగించవచ్చునని చెప్పారు. సమగ్రంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగి దాని ద్వారానే ఎన్నికలు జరిగాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న తీరును బట్టి 'సర్' కార్యక్రమం పూర్తి స్థాయిలో జరగడానికి సమయం సరిపోదని బీఎల్‌వోలు త్వరగా పనులు పూర్తి చేయాలని, బీఎల్‌వోలు చిత్తశుద్ధితో ఈ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గద్దె అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, వడ్లపట్ల నాని, యేర్నేని వేదవ్యాస్, కొర్రపాటి సురేంద్ర, దేవినేని అపర్ణ, యలమంచలి పండు, రాజామణి, గద్దె రమేష్, రమణ, కొసరాజు రవికుమార్, దుర్గారావు, గల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

## గోపాపురం లో పౌరహక్కుల దినోత్సవం



బాపట్ల నేటి శుభోదయజూన్ 30 :యస్సీ,యస్టీ వర్గాల ప్రజల పై అమలవుతున్న కుల వివక్షను రూపు మాపడం , అంటరాని తనం నిర్మూలన కోసం భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అనేక హక్కులు గురించి అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి నెలా చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం బాపట్ల మండలం గోపాపురం లో గ్రామ సభ ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ సభ ఎంతో ఉపయోగకరంగా వుంటుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజా దెబోరా చెప్పారు.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఇందులో పాల్గొంటారు కాబట్టి సమస్యలుంటే వారి దృష్టి కి తీసుకుని వచ్చి ఈ సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజా దెబోరా అన్నారు.యంపిడివో బాబురావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ఎస్సీ ఎస్టీ ప్రజలకు లభించిన హక్కులను , చట్టాలను అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. సభలో శిధిలావస్థలో వున్న గ్రామ పంచాయతీ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలని, ఇళ్ళస్థలాలు, గృహ నిర్మాణం, డ్రైనేజి నిర్మాణం, రోడ్ల మరమ్మతులు,అర్హులైన వారికి నూతన పింఛన్లు తదితర అంశాలపై వచ్చిన అర్జీలు గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపడం జరుగుతుందని చెప్పారు.గోపాపురం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, బాపట్ల మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో రూరల్ ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కూచిపూడి సాల్మన్ రాజు, గృహ నిర్మాణ శాఖ ఎ.ఇ ప్రసాద రావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారి జ్యోతి, స్థానిక పెద్దలు ఆశీర్వాదం స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి**

**తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం. ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలోని కేర్ ఢ షేర్ స్కూల్ లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎలిమెంటరీ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని, పేదరికం ఏ విద్యార్థి ప్రతిభకు అడ్డంకి కాకూడదన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు, ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.గత రెండు దశాబ్దాలుగా రిటైర్డ్ పోస్టుమాస్టర్, ప్రముఖ సామాజిక సేవకుడు రామచంద్రరావు సమాజ సేవను జీవిత ధ్యేయంగా తీసుకుని మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం, అవసరమైన విద్యా సామగ్రిని అందించడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉమా అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు, బెల్టులు, షూస్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పాఠశాల కిట్లతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి రెండు సార్లు కోడిగుడ్లు, పౌష్టికాహారం అందిస్తూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా చదువుకునే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.అదేవిధంగా 'తల్లికి వందనం' వంటి వినూత్న సంక్షేమ పథకాల ద్వారా పిల్లలను చదివిస్తున్న ప్రతి తల్లికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఉమా తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యా బోధన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో గతంతో పోలిస్తే విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు సమాజంలోని దాతలు, సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు కూడా ముందుకు వచ్చి విద్యకు చేయూత అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం--సమాజం కలిసి పనిచేస్తే ప్రతి పేద విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని ఉమా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాష్ట్ర నాగవంశీ, చైర్మన్ ఎరుబోతు రమణరావు, ఎరుబోతు శ్రావణి, డివిజన్ అధ్యక్షులు ూని కబీర్, ఎరుబోతు రామారావు, కనకరావు, గుళివిందల లీలా, సొంటి ఈశ్వరి, వేణు, మచ్చ ఇమ్మానుయేల్ స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని

**దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన**

**రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ 'బొడ్డు' కుటుంబ సభ్యులు..!!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రధాన అర్చకులు, పండితులు వేదాశీర్వాదాలు పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ పరమేశ్వరుని కృపాకటాక్షాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధిస్తూ ప్రగతిపథంలో దిగ్విజయంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించడం జరిగిందని 'బొడ్డు' కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేసారు. ఆయన వెంట సీనియర్ నాయకులు, సన్నిహితులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కుస్వాగతం పలికిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ బాబు,



అనంత పురం జూన్ 30 నేటి శుభోదయ :అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పుట్టపర్తి విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.బుధవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా స్వాగతం తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ బాబు, ఆర్డీవో సువర్ణతో పాటు ఇతర అధికారులు ,కూటమి పార్టీల నాయకులు సామకోటి ఆదినారాయణ గవర్నర్‌కు స్వాగతం పలికి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జులై 1వ తేదీన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటన



అనంతపురం, జూన్ 30 నేటి శుభోదయ :జులై 01వ తేదీన భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనకు రానున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి నారా లోకేష్ బుధవారం ఉదయం 06:30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామం రెసిడెన్స్ నుంచి బయలుదేరి విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ఉదయం 07:20 గంటలకు బయలుదేరి ఉదయం 8:00 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎయిర్పోర్ట్ కు చేరుకుంటారు. పుట్టపర్తి ఎయిర్పోర్ట్ నుంచి ఉదయం 8:15 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10:00 గంటలకు అనంతపురం జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకుంటారు. ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం యొక్క మొదటి స్నాతకోత్సవానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12:30 గంటలకు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 02:30 గంటలకు పుట్టపర్తి ఎయిర్పోర్ట్ కు చేరుకుంటారు. మధ్యాహ్నం 02:45 గంటలకు పుట్టపర్తి ఎయిర్పోర్ట్ నుంచి బయలుదేరి తిరుపతికి మంత్రి నారా లోకేష్ వెళతారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## రెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- రెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిశీలించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. సమస్యలను నమోదు చేయడమే కాకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.పరిష్కారం కాని సమస్యలకు గల కారణాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే వసంత అన్నారు. ప్రజాస్వామ్య పాలనకు ప్రతిబింబమే ప్రజాదర్బార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, సంక్షేమ పథకాల సమస్యలపై వినతులు స్వీకరించారు.వ్యక్తిగత సమస్యలతో పాటు పలు శాఖలకు సంబంధించిన వినతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వోసీలను అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



విజయవాడ, జూన్ 30 (నేటి శుభోదయ):- ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) పత్రాలను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు.జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందిన తొమ్మండ్రు వేణు కు వైద్య చికిత్స కోసం 1,12,934ల విలువైన ఎల్వోసీని, మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన బోడే సంజన కు 1,22,558ల విలువైన ఎల్వోసీని అందజేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు వైద్య చికిత్స కోసం ఇబ్బందులు పడకుండా ఎల్వోసీల ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తోందని తెలిపారు.ఎల్వోసీ పత్రాలు అందుకున్న తొమ్మండ్రు వేణు, బోడే సంజన కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన కొట్టు నాగు



తాడేపల్లిగూడెం జూన్ 30 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కొట్టు నాగు తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి తో మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం రావడం ఖాయం అని పార్టీ బలంగా ఉందని ఆయనకు వివరించినట్లు నాగు తెలిపారు.

## సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యం

**-మంత్రి కొల్లు రవీంద్ర**



పెనమలూరు, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )ప్రతి నాయకుడు,ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని,సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.మంగళవారం పెనమలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లాస్థాయి సర్ పై ప్రతేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు జోగి రమేష్,అంబటి రాంబాబు,పేర్ని నాని,దేవినేని అవినాష్ వంటి వైసీపీ నేతలు బాధ్యతారాహిత్యంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు,ఇటీవల అమరావతిలో జరిగిన పరిణామాలపై స్పందిస్తూ,కొందరు వైసీపీ నాయకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు,ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రైతులకు అవసరమైన యూరియా,డీఏపీ తదితర ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ఎమ్మెల్యే లు బోడె ప్రసాద్, యార్లగడ్డ గద్ద వెంకట్రావ్, వెనిగండ్ల రాము, వర్ల కుమారరాజా, కాగిత కృష్ణప్రసాద్, పాల్గొనగా సర్ కార్యక్రమాన్ని గ్రామ,వార్డు, బూత్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులతో సమీక్ష నిర్వహించి,పార్టీ శ్రేణులంతా సమిష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# భారత రాష్ట్రపతి పర్యటనకు సర్వం సిద్ధం..

**-ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి . ముఖ్య అతిథిగా హాజరవుతున్న భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

అనంతపురం, జూన్ 30 నేటి శుభో దయ :జులై 01వ తేదీన బుధవారం ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి గౌరవ భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారు ముఖ్య అతిథిగా హాజరవుతుండగా, బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీలో రాష్ట్రపతి పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రినారా లోకేశ్, రాష్ట్ర ఆర్థిక ు ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిపయ్యావుల కేశవ్, కేంద్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి, తదితరులు పాల్గొననున్నారు. ఇందులో భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఆర్థిక ు ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తదితరులు స్వాగతం పలకనున్నారు. కేంద్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన



హెలిప్యాడ్, స్నాతకోత్సవ కార్యక్రమం వేదిక వద్ద జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి సర్వం సిద్ధం చేశారు.

### 1,268 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం

-అనంతపురంలోని బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్దనున్న ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తన విద్యా ప్రస్థానంలో తొలి స్నాతకోత్సవాన్ని జూలై 1న బుధవారం నిర్వహించనుంది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగాన్ని చేయనున్నారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ కులాధిపతి డా.శంకర్ ఆచార్య అధ్యక్షత వహించనున్నారు. ఈ తొలి స్నాతకోత్సవంలో 2020 నుండి 2026 వరకు వివిధ విద్యా సంవత్సరాలకు చెందిన 1,268 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. వీరిలో 480 మంది స్నాతక, 788 మంది స్నాతకోత్తర విద్యార్థులు ఉండగా, వీరు దేశంలోని 23 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే 11 రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 56 విశ్వవిద్యాలయ స్వర్ణ పతకాలు, 8 దాతృత్వ స్వర్ణ పతకాలు ప్రదానం చేయనున్నారు. 2018లో స్థాపితమై, 2019లో పార్లమెంట్ చట్టం ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయ హోదా పొందిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అతి తక్కువ కాలంలోనే దేశంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగింది. ఈ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 9 స్నాతక, 18 స్నాతకోత్తర, 6 పీహెచ్.డి., 15 డిప్లొమా కార్యక్రమాలు అమలులో ఉండగా, దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన 1,470 మందికి పైగా



విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భారత రాష్ట్రపతి పర్యటనకు పటిష్టమైన భద్రత చేపట్టారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగింది. రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

## క్షణాల్లో స్పందించిన మహారాణిపేట పోలీసులు..!!

**- నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న 10 ఏళ్ల బాలికను రక్షించి తల్లిదండ్రులకు అప్పగింత**



( నేటి శుభోదయ జులై : 01 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పెట్రోలింగ్ చేస్తుండగా మహారాణిపేట పోలీసులు భీమిలి కోస్టల్ పార్క్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో 10 ఏళ్ల బాలిక ఒంటరిగా కనిపించడంతో వెంటనే రెస్క్యూ చేసి స్టేషన్ కు తీసుకెళ్లారు. స్టేషన్ లో భోజనం, స్నాక్స్ పెట్టి, ప్రేమగా ఎంక్వైరీ చేసి ఆమె ఇహ్యా ఫౌండేషన్, భీమిలిబి కి చెందినదని, రాజమండ్రి స్థానికురాలని తెలుసుకున్నారు. వెంటనే ఫౌండేషన్ కు ఫోన్ చేసి, వారి ద్వారా తల్లిదండ్రుల నంబర్లు తీసుకున్నారు.వీడియో కాల్బి ద్వారా తల్లిదండ్రులకు బాలికను చూపించి భరోసా ఇచ్చి, సీఐ దివాకర్ యాదవ్బి సమక్షంలో క్షేమంగా అప్పగించారు.మహారాణిపేట పోలీసుల మానవతా దృక్పథానికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్హెచ్ఓ, ఎంఆర్ పేట వాట్సాప్ /టెలిగ్రామ్ క్యాప్షన్ - హ్యూమన్ అంగెల్ హ్యాట్సాఫ్ మహారాణిపేట పోలీస్పెట్రోలింగ్ లో నిర్మానుష్య ప్రాంతంలో ఒంటరిగా ఉన్న 10 ఏళ్ల పాపబి కనిపించగానే క్షణం ఆలస్యం చేయకుండా సీఐ దివాకర్ యాదవ్బి టీమ్ రెస్క్యూ చేసింది. స్టేషన్ కి తెచ్చి భోజనం, స్నాక్స్ పెట్టారు ప్రేమగా వివరాలు అడిగి తెలుసుకున్నారు ఇహ్యా ఫౌండేషన్ కు ఫోన్ చేసి పేరెంట్స్ కాంటాక్ట్ తీసుకున్నారు వీడియో కాల్ లో పాపను చూపించి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు క్షేమంగా అప్పగించారు.

## 'మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం"




తాడేపల్లిగూడెం జూన్ 30 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తాడేపల్లిగూడెం శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం పట్టణంలోని డి.ఎస్. చెరువు వద్ద గల డాక్టర్ కోడె వెంకట్రావు ఐఎంఏ హాలులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కండెపు సూర్యనారాయణ, సాగిరాజు జానకిరామరాజు, రామిశెట్టి గంగాధర్ రావు, బోయపాటి రామలక్ష్మి, పుప్పాల గోపి పాల్గొన్నారు. ఈ సభకు ప్రస్తుత అధ్యక్షులు జినపనేని రాజేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. పైడికొండల సింధు, బొడ్డు అరుణ, విజయ, లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. అధ్యక్షులు రాజేంద్ర కుమార్ గత సంవత్సరం చేసిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. తమ పదవీ కాలమైన 365 రోజుల్లో 70 సేవా కార్యక్రమాలు 35 నైతిక, ఆత్మీయ సహకార కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ 365 రోజుల్లో 100 రోజులకు పైగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరినీ వచ్చిన సభ్యులు అభినందనలతో ముంచెత్తారు.నూతన కమిటీ అధ్యక్షులుగా కర్రి రాజారావు, కార్యదర్శిగా బొడ్డు అరుణ కుమారి, కోశాధికారిగా ఉడిమూడి శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శిగా దుర్భ లక్ష్మి,ఈసీ ఎడ్యుకేషన్ పూతినీడి నాగరాజు, ఈసీ ఎమర్జెన్సీ మిరియాల కిషోర్ కుమార్, ఈసీ అవేర్నెస్ ఓలేటి పాండురంగారావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో చేకూరి బంగార్రాజు, బురిడీ సతీష్, మానేపల్లి కిరణ్, కే.వి. రామారావు, వెంకటరమణ, ఎల్లపు సారథి, ఎగిన శరత్, బడుగు సుధాకర్, జకిలింకి రామకృష్ణ, నార్ని త్రిమూర్తులు, విజయ రెడ్డి, ప్రశాంతి, పాండురంగారావు, బి.హరి కుమార్, డి.పి. నాయుడు, వెంకటాచలం తదితర మానవతా సభ్యులు, పట్టణ ప్రముఖులు బుద్దాల వెంకట రామారావు, మాకా శ్రీనివాసరావు , మానేపల్లి శ్రీనివాస్, అడబాల నారాయణమూర్తి, ఆకుల త్రిమూర్తి, బత్తుల ప్రసాద్, బత్తుల సాయి,పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మానవతకు 13 లక్షల విలువైన శాంతి రథం బహుకరించిన శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తరపున పాబోలు వెంకటేశ్వరరావుని సన్మానించి మెమొంటో బహుకరించారు. పాత కమిటీ సభ్యులను వారి సేవలను గుర్తించి పెద్దలు సన్మానించి మెమెంటోలు అందజేశారు.పైడికొండల సింధు వందన సమర్పణతో సభ ముగిసింది.

## చంద్రబాబు లోకేష్ తీరుతో కుదేలవుతున్న కూటమి...

**- వైసిపి తీర్థం పుచ్చుకున్న 38వ వార్డు జనసేన నేతలు**

**కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**



( నేటి శుభోదయ జులై : 01 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) టిడిపిను బలపరిచిన జనసేన కు తగిన ప్రాధాన్యత లేకపోవడంతో నిరాశకు గురవుతున్న కార్యకర్తలు, నాయకులను పట్టించుకునే నాధుడే లేకపోవడంతో పార్టీ నుండి వీడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. చంద్రబాబు లోకేష్ దుర్మార్గపు ఆలోచనలతో పార్టీకి అండగా నిలబడే కార్యకర్తలను నేతలను విస్మరించడంతో కూటమి కుదేలవుతుందన్నారు. దీంతో విస్తు పోయిన 38వ వార్డు జనసేన నాయకులు, కార్యకర్తలు పైనలక్ష్మణరావు, పైన జాస్మిత, మూగుడు,శ్యామ్,సవరపు ప్రకాష్, కుమార్, బన్నీ, భారతి ,సతీష్,రవి,రామ్ కృష్ణ 38 వ వార్డు వైయస్ఆర్సిపి అధ్యక్షుడు గురజారపు రవి, ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఆశల మెట్ట కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి అందించిన అభివృద్ధి సంక్షేమం మరెవ్వరూ చేయలేరని స్పష్టం చేశారు. వైయస్సార్సిపి గత ఎన్నికల బరిలో ఓడినప్పటికీ 40 శాతం ప్రజల బలంతో నిలబడిందన్నారు. ప్రజల పక్షాన పోరాడుతూ కూటమి ప్రభుత్వం వ్యతిరేక విధానాలు, ఎన్నికల ముందు బాబు గారిచ్చిన సూపర్ సిక్స్ ఎన్నికల మేనిఫెస్టో బాండ్లు బుట్ట దాఖలు చేశారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు అంతే దుర్మార్గపు ఆలోచనలతో ఇంకా ప్రజలను నాయకులను మోసం చేస్తున్నాడని వాసుపల్లి ఆరోపించారు. ప్రశ్నించాల్సిన పవన్ కళ్యాణ్ జాడ లేకుండా ఉన్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్ చేస్తున్న మోసాలపై పవన్ కళ్యాణ్ ప్రశ్నించి బయటకు రావాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. రోజు రోజుకు బలోపేతం అవుతున్న వైఎస్ఆర్సిపి మళ్లీ 2029 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ చేపల నూకరాజు, 38వ వార్డ్ బూత్ ప్రెసిడెంట్స్ సందీప్,చేపల రాజు,జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయ్ డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, సౌత్ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ మళ్ళా విజయ్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ 38వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ వాట్సాప్ మనమిత్ర ద్వారా 9552300009 ద్వారా సేవటికెట్లు పొందవచ్చు..!!



( నేటి శుభోదయ జులై 01 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు ప్రతి మంగళవారం ఉదయం నిర్వహించు స్వర్ణపుష్పార్చన, మరియు ఖడ్గమాళ సేవా కార్యక్రమాలు నిర్వహించుట జరిగినది. ఈయొక్క సేవలలో ఉభయధాతలు పాల్గొన్నారు ఈపూజాదికాలు దేవస్థానప్రధాన అర్చకులు కే. శ్రీనివాస్ శర్మ వారి ఆధ్వర్యంలో నిర్వహించగా, వేదపండితులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. ఈ యొక్క సేవలు ప్రతి మంగళవారం నిర్వహించబడును, ఈ యొక్క సేవలలో పాల్గొనదలచిన వారు ఆన్ లైన్ వాట్సాప్ మనమిత్ర ద్వారా 9552300009 ద్వారా సేవటికెట్లు పొందవచ్చునని మనవి చేయడమైనది.

## షెడ్యూల్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులందరికి..!!

**- కనీస వేతనం 26 వేల రూ., చెల్లించాలి. సీఐటీయూ**




( నేటి శుభోదయ జులై : 01 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) వివిధ షెడ్యూల్డ్ పరిశ్రమలు, రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు తక్కువ లేకుండా చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా విస్తృత కమిటీ సమావేశం తీర్మానించింది. మంగళవారం జగదాంబ సిఐటియు ఆఫీసులో షెడ్యూల్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో వర్క్ షాప్ జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్ వి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కనీస వేతనాల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే కనీస వేతనాలు అతి తక్కువగా ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో గత 15 సంవత్సరాల నుంచి కనీస వేతనాల జీవోలను సవరించలేదన్నారు. దీనివలన కార్మికులు లక్షలాది రూపాయలు నష్టపోయారన్నారు. ఈ 15 సంవత్సరాల కాలంలో ధరలు ఆకాశానికి అంటుకున్నాయని కార్మికుల వేతనాలు మాత్రం పాతాళానికి తొక్క పడ్డాయి అన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకి రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలజీవోలను సవరించాల్సి ఉండగా మన రాష్ట్రంలో గత 15 సంవత్సరాల నుంచి కనీస వేతనాలు జీవోను సవరించలేదన్నారు. ఇటీవల కాలంలో ఢిల్లీ పరిసర ప్రాంతాలలో కార్మికులు మెరుపు సమ్మెలు చేసి జీతాలు పెంచుకున్నారన్నారు. తెలంగాణలో ప్రస్తుతజీతాలపై 20%, కర్ణాటకలో 60 శాతం జీతాలు అక్కడి ప్రభుత్వాలు పెంచాయన్నారు. పంజాబ్ గవర్నమెంట్ 65 వేల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేసిందన్నారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలను ఇస్తుందని కార్మికుల జీతాలు మాత్రం పెంచలేదన్నారు. తెల్లవారి లెగిస్తే అభివృద్ధి ఉపాధి కోసం మాట్లాడుతున్నటువంటి చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల జీతభత్యాల కోసం ఉద్యోగ భద్రత కోసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వం కార్పొరేట్లు పక్షమా కార్మికుల పక్షమా తేల్చుకోవాలన్నారు. ఈ రోజుల్లో కుటుంబం బతకాలంటే కనీసం 26 వేల రూపాయలు ఉంటే తప్ప జీవించలేని పరిస్థితి ఉంది. కావునా ఎక్కడ పనిచేసినా కార్మికులకు 26 వేల రూపాయలు తక్కువ లేకుండా కనీస వేతనం చెల్లించాలని వీటి సాధన కోసం భవిష్యత్తులో జరిగే పోరాటానికి కార్మికులు పెద్ద ఎత్తున కలిసి రావాలని కోరారు. సిఐటియు పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.జగ్గ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నెలకొన్నటువంటి రాజకీయ పరిస్థితులను వివరించారు. మన రాష్ట్రంలో ని తెలుగుదేశం, జనసేన, వైసిపి అన్ని పక్షాలు బిజెపి కనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, బిజెపి పూర్తిగా కార్పొరేటర్ కనుసనల్లో నడుస్తున్నదని, కార్పొరేటర్ ప్రయోజనాలే బిజెపికి ముఖ్యమని తెలియజేశారు. కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం ద్వారా మాత్రమే తమ హక్కులను కాపాడుకోగలరని జీతభత్యాలను సాధించుకోగలదని పేర్కొన్నారు.సిఐటియు రాష్ట్ర కార్యదర్శి శ్రామిక మహిళ విశాఖ జిల్లా కన్వీనర్ పి మణి మాట్లాడుతూ వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వివిధ ప్రభుత్వ స్కీమ్స్ లో పని చేస్తున్నటువంటి అంగనవాడి, ఆశ,మధ్యాహ్నం భోజనం పథకం, వివో ఏ ఆర్పి స్కూల్ శానిటేషన్ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా అధ్యక్షులు కేఎం. శ్రీనివాస్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి బి.జగన్ ఇటీవల స్టీల్ ప్లాంట్ మరియు ఫార్మసిటీ ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు పి వెంకట్ రెడ్డి, ఉరుకుటి రాజు, సిఐటియు జిల్లా నాయకులు జ్యోతి శ్వరరావు, ఎం సుబ్బారావు, వెంకట్రావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, బంగారు నాయుడు , లక్ష్మణమూర్తి, అప్పారావు, నమ్మి రమణ, మంగశ్రీ లతోపాటు వివిధ రంగాలకు చెందినటువంటి నాయకులు పాల్గొన్నారు.

## నిర్మాణ్ , పి ఎం ఎస్ యాప్ లు ఆవిష్కరించిన మంత్రి శ్రీ నారాయణ




( నేటి శుభోదయ జులై : 01 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) వి ఎం ఆర్ డి ఎ అధ్వర్యంలో డిజిటలైజేషన్ లో భాగంగా ఇంజనీరింగ్ విభాగంలో పారదర్శకత కోసం నూతనంగా రూపొందించిన నిర్మాణ్ యాప్, లే అవుట్ల వ్యవస్థలో కార్యకలాపాలు సమర్ధవంత నిర్వహణ కోసం రూపొందించిన పి ఎం ఎస్ యాప్ లను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి శ్రీ నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం సాయంత్రం మధురవాడ జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీ నారాయణ , స్థానిక శాసన సభ్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ ఎన్ తేజ్ భరత్ పాల్గొని, యాప్ ల విశిష్ఠత ను వివరించారు. నిర్మాణ్ యాప్ ద్వారా వి ఎం ఆర్ డి ఎ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపడుతున్న అన్ని ప్రాజెక్టుల నిర్వహణ లో భాగంగా అంచనాలను రూపొందించడం, పరిపాలనపరమైన ఆమోదాలు, పనుల అమలు, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్వహణ, బిల్లులు చెల్లింపుల ప్రక్రియ అంతా నిర్మాణ్ యాప్ ద్వారా జరగనున్నాయి. రియల్ టైమ్ పర్యవేక్షణ ద్వారా పారదర్శకత, బాధ్యత, పనితీరు, ప్రాజెక్టులు సమయానికి పూర్తి చేయటం ద్వారా పనితీరు మెరుగుపడుతుందని పేర్కొన్నారు.పి ఎం ఎస్ (ప్లాట్ మేనేజ్మెంట్ సిస్టమ్) యాప్ అనేది వి ఎం ఆర్ డి ఎ అభివృద్ధి చేసిన లే అవుట్ లు , ప్లాట్ లు, భూ రికార్డులు, వేలం, చెల్లింపులు, ప్లాట్ కేటాయింపులు, వేలం షెడ్యూల్ తదితర కార్యకలాపాలు సమర్ధవంత నిర్వహణ కోసం ఈ యాప్ ను రూపొందించారు. దీని ద్వారా కొనుగోలుదారులకు క్రయ, విక్రయాలు మరింత సులభతరం కానున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ శ్రీ కేతన్ గార్గ్, వి ఎం ఆర్ డి ఏ అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ముఖ్య ప్రణాళికా అధికారిణి దివ్యలత, ఓ ఎస్ డి శ్రీ కృష్ణ నాయక్, కార్యదర్శి శ్రీ మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ శ్రీ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు,డి ఎఫ్ ఓ శ్రీ రమణమూర్తి, ఎస్టేట్ అధికారి శ్రీ దయానిధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త క్యాబినెట్‌లో అమిత్ షాకు కీలక బాధ్యతలు?



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో త్వరలో జరగబోయే విస్తరణలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర మరింత కీలకం కానున్నదనే చర్చ జోరందుకుంది. 2019 మే 30న తొలిసారి హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అమిత్ షా, 2025 ఆగస్టులో లాల్ కృష్ణ అద్వానీ పేరిట ఉన్న 2,256 రోజుల రికార్డును అధిగమించి, భారత చరిత్రలోనే అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందుగా చేపడుతున్న ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కొత్త తరాన్ని ప్రోత్సహించే యోచనలో బీజేపీ అధిష్ఠానం ఉండగా.. అమిత్ షా సాధించిన పరిపాలనా విజయాల కారణంగా ఆయన రాజకీయ ప్రాధాన్యత మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. అమిత్ షా తన ఏడేళ్ల హోంమంత్రిత్వ కాలంలో దేశ భద్రత, రాజకీయ వ్యూహాల్లో ఎన్నో కీలక మైలురాళ్లను అధిగమించారు. 2019లో జమ్మూ కాశ్మీర్ నుండి ఆర్టికల్ 370, 35ఎ రద్దు చేయడం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఆమోదం, 2023లో కొత్త నేర చట్టాలను తీసుకురావడం వంటివి ఆయన కెరీర్‌లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాలలో శాంతి స్థాపన కోసం 12కు పైగా చారిత్రాత్మక ఒప్పందాల ద్వారా దాదాపు 11,000 మంది తీవ్రవాదులను ప్రధాన స్రవంతిలోకి అమిత్ షా తీసుకువచ్చారు. అలాగే, 2026 మార్చి నాటికి దేశాన్ని నక్సలిజం నుండి విముక్తి చేశారు. రాజకీయ చాణక్యుడిగా పేరొందిన అమిత్ షా, ఎంపీగా తన సొంత నియోజకవర్గమైన గాంధీనగర్‌లో నిరంతరం పర్యటిస్తూనే, పార్టీ మేనేజ్‌మెంట్‌లో సునీల్ బన్సల్, వినోద్ తావ్డే వంటి నేతలను తీర్చిదిద్దారు. 2026 మే నెలలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన తర్వాత, బంగ్లాదేశ్ నుండి వచ్చే చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దులో ఫెన్సింగ్ పనులను వేగవంతం చేశారు. అలాగే, 2026 జూన్‌లో హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య చారిత్రాత్మక 'యమునా జలాల ఒప్పందం కుదర్చడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఈ బయోడేటా ఆధారంగానే మోదీ క్యాబినెట్‌లో ఆయనకు మరింత పెద్ద పీట వేసే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు అంటున్నారు.ద

## 'వైఎస్ జగన్ పాదయాత్ర మొదలైతే.. కూటమి అంతిమ యాత్ర మొదలైనట్లే'



అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర మొదలైతే..కూటమి అంతిమ యాత్ర మొదలైనట్లేనని మాజీ మంత్రి గుడివార అమర్నాథ్ స్పష్టం చేశారు. మేకప్ మంత్రి అంటూ తాను చేసిన కామెంట్స్‌కు మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చినట్లు తెలిపారు. మంగళవారం మహిళా కమిషన్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నేను మహిళలను అవమానించానని టీడీపీ నాపై తప్పుడు ప్రచారం చేసింది. నేను చేసిన కామెంట్ పొలిటికల్ సెటైర్ మాత్రమే. హోంమంత్రి అనిత మా పార్టీ నేతలపై అనేకసార్లు ఇష్టానుసారం మాట్లాడారు. వ్యవస్థలపై గౌరవంతోనే విచారణకు హాజరయ్యాను. నేను మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నానని మహిళా కమిషన్‌కు చెప్పాను.టీడీపీ, కూటమి నేతలు ఊహించున్నవాటికి సమధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజకీయంగా మీరు వంద అంటున్నారు.. మేం ఒక్కటంటే బాధ వచ్చిందా..?. రాష్ట్రంలో మహిళలు,చిన్నారులపై హత్యలు, అత్యాచారాలపై హోంశాఖ ఎందుకు మాట్లాడటం లేదు. సాయికృష్ణ తల్లి బూడిద కోసం బాధపడుతుంటే ఎందుకు స్పందించరు. ఉప్పాల హారికపై దాడి జరిగితే ఎందుకు స్పందించరు?. జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దారుణాలపై ఎందుకు మాట్లాడరు..?.డిప్యూటీ స్పీకర్ మాటలు చూస్తుంటే ఇప్పుడున్న హోంమంత్రి పనికి రారా అనిపిస్తోంది. మహిళలపై దాడులు జరుగుతుంటే స్పందించని హోంమంత్రి పదవి ఉంటే ఎంత?.. ఊడితే ఎంత..? అని మండిపడ్డారు.మహిళలపై నాకు అపారమైన గౌరవం ఉంది. వైఎస్ జగన్ పాదయాత్ర మొదలైతే.. కూటమి అంతిమ యాత్ర మొదలైనట్లే.కూటమి నేతలకు మహిళలంటే గౌరవం లేదన్నారు.

## దేవుడంటే భక్తిలేని వ్యక్తి చంద్రబాబు.. అందుకే ఇలా..



తిరుపతి: దేవుడంటే భక్తిలేని వ్యక్తి చంద్రబాబు అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. గతంలో తాము వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తో మాట??లాడి మల్లన్న కొండ మీద మైనింగ్ అనుమతులు రద్దు చేయించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ అనుమతులన్నీ నిలిపేశామని చెప్పారు. 2015లో చంద్రబాబు స్వయంగా లైసెన్సులు ఇచ్చారని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు వచ్చినా దేవాలయాల ఆస్తులపై కన్ను వేస్తారని ఆరోపించారు. తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "మల్లయ్య కొండలో ఇనుప ఖనిజం దోపిడీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పుడు భక్తుల మనోభావాలు దెబ్బ తినడంతో ఆ పాపాన్ని వైసీపీ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 20 కోట్ల రూపాయలు మల్లయ్య కొండ అభివృద్ధికి కృషి చేసింది. టీడీపీ పాలనలో ఒక్క పైసా అభివృద్ధి ఎందుకు చేయలేదు? గతంలో కాలిబాట కూడా సరిగ్గా లేని పరిస్థితి నుంచి ఆలయ జీర్ణోద్ధరణ చేసి, రోడ్లు వేసి, విద్యుత్ సరఫరా, మంచినీరు, ఇతర సదుపాయాలు అందించింది వైఎస్సార్సీపీ ప్రభుత్వం. 2022లో ఎర్రకొండలో మైనింగ్ కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు వచ్చిన మాట వాస్తవమే. అయినా కూడా భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఎర్రకొండలో మైనింగ్ అనుమతులు ఉన్నా కూడా మేము ఆ ప్రక్రియ కొనసాగించలేదు. అనుమతులు వచ్చినా మైనింగ్ చేయకూడదు అని నిర్ణయించాం, పూర్తి గా నిలిపివేశాం. కానీ మేం ఆపేసిన ఎర్రకొండ అనుమతులు చూపించి, ఏకంగా ఆ శివుడు కొలువై ఉన్న సాధు కొండ, శివపురం లో మైనింగ్ కు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. సాధు కొండలో మైనింగ్ గురించి 2004 జనవరి 1 నుంచి జియోమైసూర్ సర్వీసెస్ అనే సంస్థ ప్రభుత్వంతో అనేకమార్లు సంప్రదింపులు జరిపింది. అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే. ఆ తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సార్లు మళ్లీ జియో మైసూర్ సంస్థ అనేక లేఖలు ప్రభుత్వానికి రాసింది. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తంబళ్లపల్లె స్థానిక ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆ ప్రాంతంలో మైనింగ్ జరిగితే ప్రజలతో పాటుగా తాను వ్యతిరేకిస్తాను అని స్వయంగా అప్పటి మైనింగ్ మంత్రి గల్లా అరుణ కుమారి కి చెప్పారు. ఈ విషయం నేను చెప్పట్లేదు..... స్వయంగా గల్లా అరుణ కుమారి ఈ అంశాన్ని ఆమె పుస్తకంలో రాసుకున్నారు. 2015లో ప్రాస్పెక్టింగ్ లైసెన్స్.... అంటే ఖనిజాలు గుర్తించేందుకు లైసెన్స్ ఇచ్చారు. అప్పుడు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే. సాధుకొండకు కూటమి ప్రభుత్వం 2025 నవంబర్ 27న టెండర్ పిలిచింది. ఏపీఎండీసీ దాఖలు చేసిన టెండర్ కు ప్రిఫర్ బిడ్డర్ కింద 900 హెక్టార్లలో ఈ ఏడాది ఏప్రిల్ 23న ఎల్.సి జారీ ఎలా చేశారు? శివపురంలో 626 హెక్టార్లలో మైనింగ్ కోసం 2025 ఫిబ్రవరి 27, సెప్టెంబర్ 4న ఉన్నత స్థాయి కమిటీ సమావేశాలు నిర్వహించి కూటమి ప్రభుత్వమే" అని చెప్పారు.

### దొంగే 'దొంగ దొంగ..' అన్నట్లు ఉంది..

దొంగే దొంగ దొంగ అన్నట్టుగా చంద్రబాబు నాయుడి ప్రభుత్వం మైనింగ్ కు పూనుకుని మాపై విమర్శలు చేస్తుందని పెద్దిరెడ్డి విమర్శించారు . "తిరుమల 7 కొండలు లానే మల్లయ్య కొండ మూడు కొండలు పవిత్రమైనవి. మల్లయ్య కొండ జోలికి వెళితే భక్తులు ఊరుకోరు. రాష్ట్రంలో మామిడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో ఒక్క కేంద్రం మంత్రి ఉన్నా అక్కడ మామిడికి 17 రూపాయల మద్దతు ధర ఉంది. చంద్రబాబుకు రైతులు అంటే ఎప్పుడూ ఇష్టం లేదు. రాష్ట్రంలో పాలన లేదు, కేవలం కేసులు పెట్టడం, టార్చర్ చేయడం, గోర్లు పీకేయడం, చంపేయడమే జరుగుతుంది" అని విమర్శించారు.

# మహాప్రయాణం



క్రీస్తు పూర్వం 8వ శతాబ్దానికి చెందిన గ్రీకు అంధకవి హోమర్ సృజనగా చెప్పే రెండు ఇతిహాస కావ్యాలు-- ఇలియడ్, ఒడిస్సీ. ఇవి పాశ్చాత్య ప్రపంచానికి మన రామాయణ, మహాభారతాల్లాంటివి. పైగా కొనసాగింపు కథలు. ట్రోజన్ యుద్ధం, హెలెన్--పారిస్ ప్రేమ, హెక్టర్ త్యాగం, అకిలీస్ పరాక్రమం, రక్తపాతం, వినాశనాన్ని ఇలియడ్ చూపిస్తే... ఆ యుద్ధం ముగిసిన తర్వాతి కథను ఒడిస్సీ చెప్తుంది. పదేళ్లపాటు జరిగిన ఆ యుద్ధంలో గెలిచిన గ్రీకు వీరుడు, ఇతకా రాజు అయిన ఒడిస్సీస్ (దీన్నే లాటిన్‌లో ఉలిసేస్ అని ఉచ్చరిస్తారు) తిరిగి తన భార్య పెనలోపి, కొడుకు తలామకస్ దగ్గరికి చేరుకోవడానికి పదేళ్లపాటు పడిన కష్టాలే ఈ కావ్యం. ఆ కష్టాల్లో కొన్ని విధివిలాసమైతే ఇంకొన్ని స్వయంకృతం. ఇలియడ్ బాహ్య యుద్ధమైతే, ఒడిస్సీ ఒక అంతర్మథనం. 'ధైర్యంగా ఉండు నా హృదయమా; నేనొక సైనికుడిని; ఇంతకంటే ఘోరమైన దృశ్యాలనే నేను చూశాను.' 'దేవుళ్లు మానవులకు కష్టాలను ఇస్తారు, తద్వారా రాబోయే తరాలకు చెప్పుకో వడానికి ఒక కథ మిగులుతుంది' అంటాడు హోమర్. ఒక నాయకుడు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ, తనను తాను తెలుసుకుంటూ గమ్యాన్ని చేరడం అనే ఇతివృత్తానికి ఒడిస్సీ శ్రేష్ఠమైన నమూనా. ఒడిస్సీస్ కేవలం శారీరక బలం గలవాడే కాదు, దుర్భేధ్య మైన ట్రాయ్‌ని, కొయ్యగుర్రం (ట్రోజన్ హార్స్) పొట్టలో సైనికులను రహస్యంగా పంపి, జిత్తులతో గెలిచినవాడు. అకిలీస్ శౌర్యం కోసం బతికితే, ఒడిస్సీస్‌కు బతకడమే ప్రధానం. వరాలు, శాపాలు, మాయలు, మంత్రాలతో సాగినప్పటికీ ఒడిస్సీలోని పాత్రలు కేవలం పురాణ బొమ్మలు కావు, అవి మానవ నైజానికి ప్రతీకలు. ఇందులో ఒంటికన్ను రాక్షసుడు పాలిఫేమస్ మన బకాసురుడిని గుర్తుకుతెస్తాడు. కొడుకు పసివాడుగా ఉన్నప్పుడు యుద్ధానికి వెళ్లిపోయిన భర్త కోసం ఇరవై ఏళ్లు వేచి చూసే పెనలోపి పాత్రలో లక్ష్మణుడి భార్య ఊర్మిళను పోల్చుకోవచ్చు. తండ్రి పెంపకం కరవైనప్పటికీ, తల్లికి తోడుగా నిలిచి, చివరకు తండ్రితో కలిసి శత్రుసంహారం చేసే మంచి కొడుకు పాత్ర తలామకస్‌ది. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఒడిస్సీస్ లాంటివాళ్లే. ఆధునిక మానవుడు కెరీర్ అనే సంద్రంలో చిక్కుకుని, ఇంటి (ప్రశాంతత) కోసం వెతుక్కుంటున్నాడు. ఇప్పటికీ ఒడిస్సీ ప్రాసంగితకు అదే కారణం. 'ఒక మనిషికి తన సొంత దేశం, తన తల్లిదండ్రుల కంటే మధురమైనది ఏదీ లేదు. పరాయి దేశంలో, కన్నవారికి దూరంగా ఎంతటి విలాసవంతమైన భవనంలో నివసించినప్పటికీ అవి దీనికి సాటిరావు'. ఒడిస్సీకి ఆంగ్లంలోనే అరవైకి పైగా అనువాదాలు వచ్చాయని ఒక లెక్క. దాన్ని ప్రేరణగా తీసుకుని వచ్చిన సృజన మరింత విస్తారమైనది. జేమ్స్ జాయిస్ రాసిన చైతన్య స్రవంతి నవల 'ఉలిసేస్' మామూలు మనుషుల మహాప్రస్థానాన్ని చెబుతుంది. 'భువన సుందరి'గా ఇలియడ్, 'రూపధరుడి యాత్రలు'గా ఒడిస్సీ తెలుగులోకీ వచ్చాయి. తాజాగా ఒడిస్సీని తెలుగు పాఠకులకు చేరువ చేయడానికి వేమూరి వేంకటేశ్వర రావు, వెంకట్ సిద్ధారెడ్డి కూడా ప్రయత్నించారు. ఒడిస్సీ, ఇలియడ్ ఇంతకుముందు చాలాసార్లు తెరకెక్కాయి. ఎన్నిసార్లయినా అంతే ఆసక్తిని పుట్టించాయి. ఈ కాలపు వండర్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ లాంటివాడు దీనిమీద ఆసక్తి కనబరచాడంటే, ప్రపంచం అంతకంటే అమితాసక్తితో జూలై 17న విడుదల కానున్న హాలీవుడ్ ఒడిస్సీ కోసం ఎదురుచూస్తోంది. 'ఇంటర్‌స్టెల్లార్'లో అంతరిక్ష ప్రయాణాన్నీ, 'ఇన్సెప్షన్'లో కలల ప్రయాణాన్నీ చూపించిన నోలన్‌కు ఒడిస్సీకంటే నప్పే కథ మరొకటి ఉండదు. స్థలకాలాలతో ముడిపెట్టి దీన్ని ఎలా చూపిస్తాడనే కుతూహలం అంతటా నెలకొంది. ఇలియడ్ ఆధారంగా వచ్చిన ట్రాయ్ (2004) సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం నోలన్‌కు వచ్చిందట. కానీ అది కుదరలేదు. మళ్లీ ఇరవై ఏళ్ల తర్వాత ఆయన ఒడిస్సీ రూపంలో హోమర్‌కు దగ్గరయ్యాడు. తప్పిపోయిన ఇంటికి ఒడిస్సీస్ 20 ఏళ్ల తర్వాత చేరుకున్నట్టే, నోలన్ కూడా తనకు ఇష్టమైన ఈ సబ్జెక్టును చేపట్టడానికి 20 ఏళ్లు పట్టింది. ఆలస్యం అవడం అంటే ఒడిస్సీస్‌లా వయసు పెరగడమే; అంటే మరింత పైచూపుతో జీవితాన్ని చూడగలిగే పరిణతి రావడమే!

# సెషెల్స్‌తో మరింత బంధం



కేవలం 115 చిన్న చిన్న దీవుల సమాహారం. అందులో నివసించటానికి పనికొచ్చేవి నాలుగంటే నాలుగే. జనాభా చూస్తే లక్షా 30 వేలు. దేశ భూభాగం కేవలం 455 చదరపు కిలోమీటర్లు మాత్రమే. ఇంత చిన్న దేశం సెషెల్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజులు పర్యటించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో అత్యంత కీలకస్థానంలో ఉన్న ఈ ద్వీపకల్పం ఆఫ్రికా తూర్పు తీరానికి సమీపంలో, హిందూమహా సముద్రంలోని అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాలకు సమీపంలో ఉంది. ఇది ఆసియా--ఆఫ్రికా సముద్ర మార్గాల కూడలి కనుక ఆఫ్రికా, యూరప్, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే నౌక లన్నీ ఈ ప్రాంతంనుంచే పోవాలి. ఆ నౌకలు నిత్యం ముడిచమురు, సహజవాయు నిక్షేపాలు, ఆహారపదార్థాలు, ముడి సరుకులు మోసుకుపోతుంటాయి. ఆ దేశాధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఈ ఏడాది మొదట్లో మన దేశం వచ్చారు. అటు తర్వాత మన దేశం అక్కడికి 250 టన్నుల ఆహార పదార్థాలు, భవన నిర్మాణాలకు అవసరమయ్యే సిమెంట్, ఇతరమైనవి పంపింది. దానికి కొనసాగింపుగా మోదీ జరిపిన ప్రస్తుత పర్యటనలో ఇరు దేశాలమధ్యా 19 అంశాల్లో అంగీకారం కుదిరింది. తమవంటి ద్వీపకల్ప దేశాల ఆకాంక్షలను ప్రపంచ వేదికలపై ఎలుగెత్తిచాటుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న భారత్‌పై ఆ దేశంలో ఆదరాభిమానాలున్నాయి. 1986లో అప్పటి దేశాధ్యక్షుడైన ఫ్రాన్స్ ఆల్బర్ట్ రెనే సోవియెట్ యూనియన్ పర్యటనకెళ్లినప్పుడు సెషెల్స్‌లో తిరుగుబాటుకు కుట్ర పన్నిన వైనంపై ముందస్తు సమా చారం అందుకున్న నాటి ప్రధాని రాజీవ్ గాంధీ హుటాహుటీన నావికా దళాన్ని పంపి దాన్ని అణిచేశారు. సెషెల్స్ నిడివి చిన్నదైనా సాగరజలాల్లో దాని ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఎస్‌జెడ్) ఏకంగా 13.7 లక్షల చదరపు కిలోమీటర్లు. అంటే భూభాగంకన్నా దాని సముద్ర వ్యాప్తి దాదాపు 3,000 రెట్లు అధికం. హిందూ మహాసముద్రంలో చైనా క్రమేపీ తన ప్రాబల్యాన్ని విస్తరించుకోవటానికి ముత్యాల తీగ (స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్) పేరిట పాగా వేయాలని చూస్తోంది. ఆఫ్రికా తీరమైన జిబూటిలో ఇప్పటికే సైనిక స్థావరం ఏర్పాటులో బిజీగా ఉంది. కనుక ఈ ప్రాంతంలో తన పట్టు నిలుపుకొనాలంటే సెషెల్స్‌తో భారత్‌కు బలమైన బంధం ఉండితీరాలి. కోస్తా రాడార్ నెట్ వర్క్ పేరిట మన దేశం ఏర్పాటుచేసిన వ్యవస్థ ఆ ప్రాంతంలో ప్రయాణించే ప్రతి నౌక కదలికనూ ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. అక్కడ సముద్ర దొంగల బెడద కూడా ఎక్కువే. దాంతోపాటు మాదకద్రవ్యాల స్మగ్లింగ్, అక్రమ చేపలవేట ఉంటాయి. ఇలాంటి సమస్యలను ఎదుర్కొనటానికి రాడార్ నెట్ వర్క్ ఎంతగానో తోడ్పడుతున్నది. దీంతోపాటు మన దేశం డోర్నియర్ నిఘా విమానాలనూ, గస్తీ నౌకలనూ బహుమతిగా ఇచ్చింది. వాటిపై సెషెల్స్ రక్షణ సిబ్బందికి శిక్షణనిచ్చింది. 2020లో ఆ దేశ సుప్రీంకోర్టు భవనాన్ని ఉచితంగా నిర్మించి ఇచ్చింది. ప్రసిద్ధ నావికుడు వాస్కోడిగామా 1502లో తొలిసారి ఈ ద్వీపకల్పాన్ని సందర్శించి నప్పుడు ఇక్కడ మానవ సంచారం లేదని చెబుతారు. అటుతర్వాత 1756లో ఫ్రాన్స్ దీన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంది. అప్పటి ఫ్రాన్స్ ఆర్థికమంత్రి జీన్ మోరో సెషెల్స్ పేరిట ఈ ద్వీపకల్పానికి సెషెల్స్‌గా నామకరణం చేశారు.

1770లో ఇక్కడ వ్యవసాయ పనులకు ఫ్రాన్స్ ఆఫ్రికానుంచి భారీయెత్తున కార్మికులను తరలించింది. అప్పుడు మన దేశం నుంచి కూడా వెళ్లారు. నెపోలియన్ యుద్ధాల్లో ఒకదానిలో ఫ్రాన్స్ ఓడిపోవటంతో 1814లో ఇది బ్రిటన్ అధీనంలోకి వచ్చింది. చివరకు 1976లో దీనికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రస్తుత సెషెల్స్ జనాభాలో 12 శాతంమంది మన దేశంనుంచి వలసవెళ్లిన గుజరాత్, తమిళనాడులకు చెందినవారే. హిందూ మహాసముద్ర ప్రాంత ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోంది. అవకాశం దొరికితే కాలూనడానికి చైనాతోపాటు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రాంతం శాంతియుత మండలంగా ఉండాలని మన దేశం మొదటినుంచీ కోరుకుంటోంది. ఇరు దేశాల సంబంధాలూ భద్రతకే పరిమితం కాకుండా పర్యావరణ పునరు ద్ధరణ, పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధన వనరులు, డిజిటల్ రంగ సదుపాయాలు వగైరాలకు సైతం విస్తరించాయి. ఇరు దేశాల బాంధవ్యం ముమ్మందు మరింతగా ఎదుగు తుందని మోదీ పర్యటన నిరూపించింది.

# అన్నదాతలకు అభయహస్తం



సమాజానికి వెన్నెముక అయిన రైతులకు అధిక ప్రాధాన్యతిస్తూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసింది. 'రైతు భరోసా'తో రైతుల్లో పూర్తి విశ్వాసం కలిగిస్తోంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అన్నదాతలకు అభయం హస్తం అందిస్తోంది. ఇప్పటికే రెండుసార్లు 'రైతు భరోసా' అందించిన ప్రభుత్వం మరోసారి 2026 జూన్ 30న ఖరీఫ్ సీజన్‌కుగానూ ఇచ్చేందుకు సిద్ధమైంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ముందు వరంగల్ వేదికగా 'రైతు డిక్లరేషన్'లో ప్రకటించిన విధంగా రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నా లకు బోనస్, రైతు బీమా, రైతు కూలీలకు 'ఇందిరమ్మ భరోసా' వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకుంది. ప్రభుత్వం ఏటా ఎకరాకు రూ. 12 వేలు రైతు భరోసాగా అందిస్తోంది. 2025 జూరీ లోనూ, 2026 మార్చిలోనూ 70 లక్షల మందికి అందించింది. మూడోసారి జూన్‌లో ఒకే విడతలో ఈ సాయం అందించనున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసింది. దీంతో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ. 21 వేల కోట్ల మేలు చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా సన్న వరికి బోనస్ అందించడంతో రాష్ట్రంలో సన్నాల సాగు 60 శాతం పెరిగింది. దేశంలోనే తొలిసారిగా రైతు కూలీలను గుర్తించి వారిలో విశ్వాసం కలిగించేలా 'ఇందిరమ్మ రైతు భరోసా' అందిస్తోంది. రైతు కుటుంబాలందరికీ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తూ వేల కోట్ల రూపాయలతో రైతు బీమా కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకా రాలు లభించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం భారీగా పంటలను కొనుగోలు చేస్తోంది.

### నిధులు దుర్వినియోగం కాకుండా...

అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటే భరించలేని బీఆర్ఎస్ పార్టీ అక్కసుతో అవాస్తవాలను ప్రచారం చేస్తోంది. గతంలో వారి ప్రభుత్వం 'రైతు బంధు' పేరిట ఎకరాకు రూ. 10 వేలు మాత్రమే ఇస్తే... కాంగ్రెస్ సర్కార్ మరో రెండువేలు అధికంగా ఇస్తోంది. గత ప్రభుత్వ అవకతవకలు పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రస్తుత సర్కారు వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అందించాలని నిర్ణయించింది. అందుకే ప్రజా నిధులు దుర్వినియోగం కావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఏమాత్రం ఉపయోగపడని భూములకు రైతుబంధు పథకం కింద రూ. 22 వేల కోట్లకుపైగా చెల్లించి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది. రైతులకే కాకుండా రైతు కూలీలకు కూడా సమన్యాయం జరి గేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూమిలేని రైతు కూలీలకు ప్రభుత్వ నిర్ణయం శాపంగా మారకూడదని, వారిని కూడా ఆదుకోవాలనే లక్ష్యంతో 'వరంగల్ డిక్లరేషన్'లో ప్రకటించినట్టు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఏటా రూ. 12 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడంతో వ్యవసాయ యజ్ఞంలో పాల్గొనేవారందరికీ న్యాయం చేసినట్టయ్యింది. శుభప్రదమైన ఏరువాక పౌర్ణమి మరుసటి రోజు జూన్ 30న ప్రభుత్వం నిర్వహించనున్న రైతు భరోసా పంపిణీ మరోసారి అన్న దాతల పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనంగా నిలవనుంది. రైతు సంతోషమే రాష్ట్ర సుభిక్షతకు పునాది అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

శుభోదయం
బుధవారం - 01 - జూలై - 2026

# వర్క్ ఫ్రమ్ హోమ్.. కొత్త కండీషన్




టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో అడుగుజాడల్లో నడుస్తూ మరో దేశీ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్.. తన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని మరింత కఠినతరం చేసింది. అదనపు వర్క్ ఫ్రమ్ హోమ్ రోజులను కోరుకునే ఉద్యోగుల కోసం కొత్త షరతులను ప్రవేశపెట్టింది. బెంగళూరు ప్రధాన కార్యాలయంగా ఉన్న ఇన్ఫోసిస్, ఇకపై ఒక్కో త్రైమాసికంలో గరిష్టంగా ఐదు అదనపు వర్క్ ఫ్రమ్ హోమ్ రోజులు లేదా వర్క్ ఫ్రమ్ ఆఫీస్ మినహాయింపులకు మాత్రమే అనుమతి ఇస్తుంది. ఉద్యోగి లేదా అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సంబంధించిన క్లిష్టమైన వైద్య పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే దీనికి మినహాయింపు ఉంటుంది. అలాంటి సందర్భాల్లో డాక్టర్ వెరిఫికేషన్‌తో పాటు అవసరమైన డాక్యుమెంట్లు తప్పనిసరిగా సమర్పించాలి. ప్రస్తుతం జాబ్ లెవల్ 5, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులు నెలకు కనీసం 10 రోజులు కార్యాలయం నుంచి పని చేయాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనలు, అదనంగా సహాయక వర్క్ ఫ్రమ్ హోమ్ రోజులు కోరే అభ్యర్థనలపై మరింత నియంత్రణకు ఉద్దేశించినవిగా కంపెనీ తెలిపింది. ఉద్యోగులకు మేనేజర్లు పంపిన ఈమెయిల్స్ ప్రకారం.. అదనపు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆమోదం కోసం వచ్చే అభ్యర్థనల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఏదైనా వర్క్ ఫ్రమ్ హోమ్ అభ్యర్థన ఉంటే ఈమెయిల్ ద్వారా కాకుండా సిస్టమ్ ద్వారా ముందస్తు ఆమోదం పొందాలని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ఉద్యోగులు ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. "పాలసీ ప్రకారం అభ్యర్థన ఆమోదించబడకపోతే, మేనేజర్లుగా తాము చేయగలిగేదేమీ లేదు" అని పేర్కొన్నారు. దేశంలో రెండవ అతిపెద్ద ఐటీ సంస్థగా ఉన్న ఇన్ఫోసిస్‌లో 3 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. కంపెనీ 2023 నవంబర్ 20న రిటర్న్-టు-ఆఫీస్ విధానాన్ని ప్రకటించినప్పటికీ, దాన్ని 2024 మార్చి 10 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయడం ప్రారంభించింది. ఈ విధానం ప్రకారం ఉద్యోగులు కార్యాలయంలో కనీసం మూడు గంటలు గడపాల్సి ఉంటుంది.

# ఈ-గేమింగ్ రంగంలో నియామకాలు భళా!



భారతీయ గేమింగ్ పరిశ్రమ ప్రస్తుతం ఒక కీలక మలుపులో ఉంది. రియల్ మనీ గేమింగ్ పై ఉన్న ఆంక్షలు సుమారు రెండు లక్షల ఉద్యోగాలపై ప్రభావం చూపుతాయనే ఆందోళనల మధ్య, ఈ-గేమింగ్ రంగం అనూహ్య రీతిలో పుంజుకుంటోంది. గడిచిన ఐదు నెలలుగా పరిశ్రమ తన వ్యూహాలను మార్చుకుంటూ, ప్రతిభను నిలుపుకోవడమే కాకుండా కొత్త విభాగాల్లో ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది.

## కోర్ డెవలప్‌మెంట్‌కు క్రేజ్

ప్రస్తుతం భారతీయ గేమింగ్ మార్కెట్ కేవలం వినోదం కోసమే కాకుండా హై-ఎండ్ గేమ్ డెవలప్‌మెంట్ హబ్‌గా మారుతోంది. ఇన్‌స్టాహైర్ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం ఈ రంగంలో 50,000 నుంచి 60,000 వరకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. యూనిటీ , అన్‌రియల్ డెవలపర్లు, సీంం ఇంజినీర్లు, 3డీ ఆర్టిస్టులు, గేమ్ డిజైనర్లకు గిరాకీ పెరిగింది. మొత్తం ఉద్యోగాల్లో వీటి వాటా 70-80 శాతంగా ఉంది. భారతీయ స్టూడియోలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి ాాాాా క్వాలిటీ టైటిల్స్ రూపొందించడంపై దృష్టి పెట్టాయి. టోర్నమెంట్ మేనేజర్లు, కంటెంట్ క్రియేటర్లు, అనలిస్ట్ ఉద్యోగాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2026 చివరి నాటికి గేమింగ్ రంగంలో ఉపాధి 60-70 శాతం వృద్ధి చెందుతుందని ఇన్‌స్టాహైర్ అంచనా వేసింది.

## నియంత్రణలతో భరోసా

'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం, 2025' అమల్లోకి రావడం పరిశ్రమకు ఒక వరంలా మారిందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఇది ఆర్ఎంజీ, సాధారణ ఈ-గేమ్స్ మధ్య స్పష్టమైన సరిహద్దులను ఏర్పరిచినట్లు తెలుపుతున్నారు. '75 శాతం భారతీయ ఈ-స్పోర్ట్స్ ప్లేయర్లు ఈ రంగాన్ని ఒక గౌరవప్రదమైన కెరీర్‌గా భావిస్తున్నారు. కేవలం ప్లేయర్లుగానే కాకుండా కోచ్‌లు, ఈవెంట్ మేనేజర్లుగా మారేందుకు 56 శాతం మంది ఆసక్తి చూపుతున్నారు' అని జెంట్‌సింథసిస్ సర్వే తెలిపింది.

## ప్రతిభను వదులుకోని కంపెనీలు

ఆర్ఎంజీ కంపెనీల్లో గతంలో నియామకాలు తాత్కాలికంగా నెమ్మదించినప్పటికీ అక్కడ ఉన్న నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఇతర గేమింగ్ విభాగాలు అందిపుచ్చుకుంటున్నాయి. డ్రీమ్ స్పోర్ట్స్ తమ వద్ద ఉన్న ప్రతిభను వదులుకోకుండా తమ గ్రూప్‌లోని ఇతర ఏడు ప్లాట్‌ఫారమ్‌ల్లో ఉద్యోగులను సర్దుబాటు చేస్తామని ప్రకటించింది. ఫెలిసిటీ గేమ్స్ గతంలో ఆర్ఎంజీ విభాగాల్లో పనిచేసిన హెడ్ ఆఫ్ ఇంజినీరింగ్, అనలిటిక్స్ వంటి కీలక నిపుణులను నియమించుకుంది. పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆర్ఎంజీపై ఆంక్షలు ఒక రకంగా ఇతర గేమింగ్ విభాగాలు గ్లోబల్ స్థాయిలో ఎదిగేందుకు మార్గం సుగమం చేశాయి.

# యాప్‌రే యాప్..

## డౌన్‌లోడ్స్‌లో ప్రపంచంలో మనమే టాప్



మొబైల్ అంటేనే యాప్స్. ఉత్పాదకత, వినోదం, సోషల్ మీడియా, విద్య, యుటిలిటీ, ఈ--కామర్స్.. అవసరం ఏదైనా మొబైల్ అప్లికేషన్స్‌తోనే (యాప్స్) మన జీవితం ముడిపడి ఉంది. ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది 14,900 కోట్ల యాప్ డౌన్‌లోడ్స్ నమోదయ్యాయంటే వీటికి ఉన్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. డౌన్‌లోడ్స్‌తోపాటు వినియోగంలోనూ భారత్ అగ్రస్థానంలో ఉంది. ఐఓఎస్, గూగుల్ ప్లే స్టోర్ వేదికగా ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది నిమిషానికి వివిధ రకాల యాప్స్‌నకుగాను 2,84,000 డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి. ఫీచర్స్, కంటెంట్, సేవల కోసం మొబైల్ యూజర్లు ఈ యాప్స్‌నకు నిమిషానికి రూ.2.9 కోట్లు ఖర్చు చేశారు. తొలిసారిగా గేమ్స్ కంటే యాప్స్‌పై అధికంగా వ్యయం చేశారని అమెరికాకు చెందిన డిజిటల్ ఇంటెలిజెన్స్, యాప్ డేటా ఎనాలిసిస్ కంపెనీ సెన్సార్ టవర్స్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో యాప్‌ల కథాకమామీషు ఎలా ఉందో చూద్దాం..



యాప్స్‌కు అధికంగా ఖర్చు చేస్తున్న టాప్-10 దేశాలు..

| | | | |
|---|---|---|---|
| 1 అమెరికా | 4 దక్షిణ కొరియా | 7 ఫ్రాన్స్ | 10 ఆస్ట్రేలియా |
| 2 చైనా | 5 యూకే | 8 కెనడా | |
| 3 జపాన్ | 6 జర్మనీ | 9 తైవాన్ | |

2025లో మొబైల్ యాప్ ప్రపంచం

| | |
|---|---|
| యాప్ డౌన్‌లోడ్స్ 14,900 కోట్లు | వెచ్చించిన టైమ్ 5.3 లక్షల కోట్ల గంటలు |
| కస్టమర్ల ఖర్చు రూ.15,29,720 కోట్లు | సగటు సమయం ఒక్కో యూజర్ రోజుకు 3.6 గంటలు |

వినియోగం - నెలకు 34 యాప్స్

2025లో యాప్ డౌన్‌లోడ్స్‌లో టాప్-5 దేశాలు.. (కోట్లలో)

| | |
|---|---|
| భారత్ | 2,550 |
| అమెరికా | 1,260 |
| బ్రెజిల్ | 929 |
| ఇండోనేసియా | 778 |
| చైనా | 615 |

2025లో భారత్‌లో విభాగాల వారీగా టాప్ డౌన్‌లోడ్స్, యాప్ వివరాలు

| విభాగం | మొత్తం డౌన్‌లోడ్స్ (కోట్లలో) | టాప్ యాప్ |
|---|---|---|
| సోషల్ మీడియా | 89.6 | ఇన్‌స్టాగామ్ |
| వీడియో ఎడిటింగ్ | 66 | మాస్ట్ |
| ఫొటో ఎడిటింగ్ | 62.5 | రెమిని |
| షాపింగ్ | 55.5 | మీషో |
| ఓటీటీ | 55.2 | జియోహాట్‌స్టార్ |

# ఈ ఆరు అలవాట్లు పాటిస్తే మధుమేహాన్ని అదుపులో పెట్టుకోవచ్చట..!

మనం తినే ప్రతి ముద్ద శరీరానికి శక్తిని ఇవ్వడమే కాదు, రక్తంలో చక్కెర స్థాయిల (రాబస్త్రుతీ శ్రీవజవశ్రీం) ను కూడా నిర్ణయిస్తుంది. ఒకసారి బ్లడ్ షుగర్ ఎక్కువైనా, ఒక్కసారిగా తగ్గిపోయినా శరీరం వెంటనే సంకేతాలు ఇస్తుంది. అలసట, ఆకలి, చిరాకు, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు మొదలవుతాయి. అయితే రోజువారీ జీవితంలో కొన్ని సాధారణ అలవాట్లు పాటిస్తే బ్లడ్ షుగర్‌ను రోజంతా స్థిరంగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పాటించాల్సిన ఆ అలవాట్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

## సమతుల ఆహారం

బ్లడ్ షుగర్‌ను నియంత్రించడంలో సమతుల ఆహారం కీలకంగా పనిచేస్తుంది. ప్రతి భోజనంలో ప్రొటీన్, పీచు, గుడ్ కొలెస్ట్రాల్ ఉండేలా చూసుకోవాలి. చికెన్, చేపలు, గుడ్లు, పప్పులు, టోఫూ వంటి ప్రొటీన్ ఆహారాలు మంచివి. కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. తీపి పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్, శీతల పానీయాలను తగ్గించడం మంచిది.

## తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్

అన్ని కార్బోహైడ్రేట్లు ఒకేలా పనిచేయవు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారం నెమ్మదిగా జీర్ణమవుతుంది. దాంతో రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగదు. ఓట్స్, బ్రౌన్‌రైస్, క్వినోవా, పప్పులు, పీచు ఎక్కువగా ఉన్న కూరగాయలు ఇందుకు మంచి ఎంపికలు. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

## భోజనం సమయం

ఉదయం అల్పాహారాన్ని ఎప్పుడూ మానేయొద్దు. నిద్రలేచిన రెండు గంటల్లోపు బ్రేక్‌ఫాస్ట్ చేయడం మంచిది. మూడు నుంచి నాలుగు గంటల వ్యవధిలో ఆహారం తీసుకోవాలి. తినేటప్పుడు ముందుగా కూరగాయలు, తర్వాత ప్రొటీన్, చివరగా కార్బోహైడ్రేట్లు తీసుకోవడం ఉపయోగకరం. చిన్న ప్లేట్లు ఉపయోగిస్తే ఆహార పరిమాణాన్ని కూడా సులభంగా నియంత్రించవచ్చు.

## రోజువారీ అలవాట్లు

భోజనం చేసిన వెంటనే పది నిమిషాలు నడవడం మంచి ఫలితాలు ఇస్తుంది. వారానికి కనీసం మూడు రోజులు కండరాల బలం పెంచే వ్యాయామాలు చేయాలి. మొత్తం వారానికి 150 నిమిషాల శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలి. రోజూ 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం లేదా శ్వాస వ్యాయామాలు చేయడం కూడా మంచిదే. రోజంతా తగినంత నీరు తాగడం మర్చిపోవద్దు.

## ఆహార పరిమాణం

ఎంత ఆరోగ్యకరమైన ఆహారం అయినా మోతాదుకు మించి తింటే ప్రయోజనం తగ్గుతుంది. అందుకే ఒకేసారి ఎక్కువగా తినకుండా జాగ్రత్త పడాలి. చిన్నచిన్న మోతాదుల్లో ఆహారం తీసుకోవడం మంచిది. మధ్యలో ఆకలివేస్తే పండ్లతోపాటు బాదం, వాల్‌నట్స్ లేదా కొద్దిగా చీజ్ తీసుకోవచ్చు. ఇలా చేస్తే ఆకలి కూడా అదుపులో ఉంటుంది.

## తరచూ పరీక్ష

మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయులను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. ఏ ఆహారం తిన్న తర్వాత షుగర్ ఎలా మారుతోందో గమనించాలి. ఆ సమాచారం ఆధారంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవచ్చు. అవసరమైతే వైద్యుడి సలహాతో డైట్ ప్లాన్‌ను మార్చుకోవాలి. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడంవల్ల భవిష్యత్‌లో వచ్చే సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చు.



EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016